'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com
అక్షర
# రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక
AKSHARA RAJAAMUDHRA
RNI No: TELTEL/2024/86684

మేడ్చల్-మల్కాజ్‌గిరి | శుక్రవారం | 29.08.2025 | సంపుటి : 2 | సంచిక :206 | పేజీలు : 8 | వెల : 2/-
MEDCHAL-MALKAJGIRI | Friday | 29.08.2025 | volume : 2 | Issue : 206 | Pages : 8 | Cost : 2/-



విలేకరులు కావలెను
'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.
సంప్రదించాల్సిన చిరునామా..
సెల్ : 9182 474 575


## అల్పపీడనంతో
# అతలాకుతలం

### కామారెడ్డి, మెదక్ జిల్లాల్లో తీరని నష్టం

- రోడ్లు, కల్వర్టులకు గండ్లు - రాకపోకలకు అంతరాయం
- నీటమునిగిన దాదాపు అన్ని పంటలు
- ఊళ్లన్నీ చెరువుల్లా మారడంతో ప్రజల అవస్థలు
- డ్రోన్ల ద్వారా ఆహార పొట్లాల పంపిణీ
- ముమ్మరంగా సహాయక చర్యలు

04

హైదరాబాద్, ఆగస్ట్ 28 :
అల్పపీడనం వలన తెలంగాణ రాష్ట్రంలోని పలుచోట్ల తీవ్ర పరిణామాలు చోటుచేసుకున్నాయి. కామారెడ్డి, మెదక్, నిర్మల్ జిల్లాల్లో మంగళవారం రాత్రి నుంచి బుధవారం రాత్రి వరకు కుంభవృష్టి కురవడంతో భారీ నష్టం సంభవించింది. చెరువులు, కాలువలు పొంగిపొర్లాయి. కల్వర్టు లు, రోడ్లు పాడయ్యాయి. ముఖ్యంగా కామారెడ్డి, మెదక్ జిల్లాల్లో జనజీవనం అస్తవ్యస్తమైంది. తెలంగాణలోని పలు ప్రాంతాల్లో అతి భారీ వర్షాలు కురవడంతో, కామారెడ్డి, మెదక్ జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశారు. కామారెడ్డి జిల్లాలో వర్షాలు బీభత్సాన్ని సృష్టించాయి. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. పంట పొలా లు, నివాస ప్రాంతాలు చెరువులుగా మారాయి. దాదాపు అన్ని పంటలు నష్టపోయాయి.





కొనసాగుతున్న
## ఉపరితల ఆవర్తనం
మరో రెండ్రోజులు వర్షాలకు ఛాన్స్ 02

విద్యాసంస్థలకు
## సెలవుల ప్రకటన
13 జిల్లాల్లో పాఠశాలలకు విద్యాశాఖ ఆదేశం 02



గోదావరి జలాల తరలింపులో
## శ్రీపాద ఎల్లంపల్లి కీలకం
- మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం ప్రాజెక్టుల్లో నీరు నిల్వ అసాధ్యం
- నిర్మాణ, నిర్వహణ లోపాలే కారణం : సీఎం రేవంత్ రెడ్డి
- అల్లుడు స్వాతిముత్యం.. మామ ఆణిముత్యం అంటూ సెటైర్లు 03
- వరద ప్రభావిత ప్రాంతాల్లో సీఎం ఏరియల్ సర్వే

## ప్రజల కష్టాలపై పట్టింపేది?
- సిరిసిల్ల జిల్లాలో వరద ప్రభావిత ప్రాంతాల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పర్యటన
- 'నీరో చక్రవర్తిలా సీఎం ప్రవర్తన" అంటూ ఎద్దేవా
- నష్ట పరిహారాలు ప్రకటించాలని డిమాండ్ 03

సిరిసిల్ల, ఆగస్టు 28 :
రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు విస్తారంగా కురుస్తున్నా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రజల కష్టాలపై పట్టింపు లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. సిరిసిల్ల జిల్లాలో వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కేటీఆర్ మాట్లాడుతూ, "రోమ్ నగరం తగలబడ్డ సమయ ంలో నీరో చక్రవర్తి వీణ వాయించాడని చరిత్ర చెబుతుంది. ఇప్పటికీ రాష్ట్రంలో వరదలు ముంచెత్తుతుంటే, సీఎం రేవంత్ మాత్రం మూసీ నది సుందరీకరణ, ఒలింపిక్స్ గురించి సమీక్షలు నిర్వహిస్తున్నారు," అంటూ తీవ్ర విమర్శలు చేశారు.





క్రీడా ప్రపంచానికి హైదరాబాద్
## దిక్సూచిగా మారాలి
క్రీడా ప్రపంచానికి హైదరాబాద్ దిక్సూచిగా మారాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. తెలంగాణకు ఐటీ, సంస్కృతి ఉందని... రాష్ట్రంలోని ప్రతి కుటుంబం తమ పిల్లలు ఐటీ రంగంలో ఉండాలనుకుంటున్నారని... అలా కాకుండా క్రీడా సంస్కృతి కూడా రావాలని తాను అభిలషిస్తున్నట్టు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఖేలో ఇండియా, కామన్‌వెల్త్, ఒలింపిక్స్ ఇలా ఏ పోటీలు నిర్వహించినా వాటిలో తెలంగాణకు అవకాశం కల్పించాలని తెలంగాణ స్పోర్ట్స్ హబ్ తీర్మానం చేసింది.

- అంతర్జాతీయ స్థాయిల్లో తెలంగాణ నిలవాలి
- క్రీడా విధానం, క్రీడల ప్రోత్సాహం విషయంలో మన వైపే చూడాలి
- గ్రామ స్థాయి నుంచి క్రీడాకారులకు తర్ఫీదు
- తెలంగాణ స్పోర్ట్స్ హబ్ బోర్డు సమావేశంలో సీఎం రేవంత్



సహాయకచర్యలకు
## హెలికాప్టర్లు
ఆర్మీ హెలికాప్టర్లు పంపాలను కేంద్ర మంత్రి బండి ఆదేశం 03



నష్టాలపై ప్రాథమిక
## అంచనా వేయండి
- నష్టాలపై నివేదికలు వెంటనే సమర్పించండి
- సంబంధిత శాఖల అధికారులకు సిఎస్ సూచన 02



## చనిపోయిన వారి కుటుంబాలను ఆదుకోవాలి
### పునరావాస బాధితులను పరామర్శించిన ఎంపి రఘునందన్
02

వరదల్లో చనిపోయిన వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు డిమాండ్ చేశారు. వరదల్లో నష్టపోయిన వారిని కూడా ఆదుకోవాలన్నారు. విద్యుత్ పునరుద్దరణ పనులు తోణం చేపట్టాలన్నారు. మెదక్‌లోని జీకేఆర్ ఫంక్షన్ హాలులో ఏర్పాటు-చేసిన పునరావాస కేంద్రంలో వరద బాధితులను పరామర్శించారు.

అమెరికా చదువు..
## నాలుగేళ్లకు మించి ఉండొద్దు
### విదేశీ విద్యార్థుల నెత్తిన మరో పిడుగు

అమెరికాలో చదువుల కోసం ప్రయత్నిస్తున్న, అగ్ర రాజ్యంలో ఉంటున్న విదేశీ విద్యార్థులపై మరో పిడుగు పడిం ది. ఇప్పటికే వీసాల జారీకి 'సోషల్ మీడియా వెట్టింగ్'ను కఠినంగా అమలుచేస్తోన్న అగ్రరాజ్యం.. తాజాగా మరో మార్పు తీసుకొచ్చేందుకు సిద్ధమైంది. విద్యార్థులు, ఎక్స్ఛేంజ్ విజిటర్లు, మీడియా ప్రతినిధులకు జారీ చేసే వీసాలకు పరిమిత కాల గడువు విధిస్తూ ప్రతిపాదనలను ఆవిష్కరించింది. అంటే.. ఇకపై విదేశీ విద్యార్థులు నాలుగేళ్లకు మించి అమెరికాలో ఉండకుండా వీసా నిబంధనల్లో మార్పులు చేయనుంది. ప్రస్తుతం ఎఫ్-1 వీసాలపై అమెరికాలో ఉన్న అంతర్జాతీయ విద్యార్థులు, జే-1 వీసాలపై వచ్చిన ఎక్స్ఛేంజ్ విజిటర్లకు 'డ్యూరేషన్ ఆఫ్ స్టే' వెసులుబాటు ఉంది.



10



భారీ వర్షాలతో పలుచోట్ల
## రోడ్లకు గండ్లు
- రోడ్లు దెబ్బతిన్న ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు
- తక్షణ పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలి 02
- మంత్రి కోమటిరెడ్డి ఆదేశం


03

తెలంగాణలో
## 36 రైళ్లు రద్దు



## కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం

### మరో రెండ్రోజులు వర్షాలకు ఛాన్స్

**హైదరాబాద్, ఆగస్టు 28 :** వాయువ్య బంగాళాఖాతం పరిసరాల్లో ఒడిశా, వెస్ట్ బెంగాల్ తీరాలకు సమీపంగా ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. సముద్ర మట్టం నుంచి 5.8 కిలోమీటర్ల ఎత్తులో ఏర్పడిన ఈ ఆవర్తనం రానున్న 24 గంటల్లో అల్పపీడనంగా బలపడనుందని వాతావరణ శాఖ పేర్కొంది. అలాగే తూర్పు ఆగ్నేయ దిశ నుంచి ఈశాన్య బంగాళాఖాతం వరకు వృత్తాకార పవన ద్రోణి కొనసాగుతోందని వెల్లడించింది. సిద్దిపేటలోని శ్రీనగర్ కాలనీ వరద నీటిలో మునిగిపోయింది. రోడ్లపై నుంచి నీరు ఉధృతంగా పారుతుండగా, పలు ఇళ్లలోకి నీరు చేరింది. దీంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ క్రమంలో మున్సిపల్ అధికారులు కాలనీలో నిలిచిపోయిన నీటిని బయటకు తరలించే చర్యలు చేపట్టారు. వాతావరణ శాఖ తాజా హెచ్చరికల ప్రకారం, మరో మూడు రోజులపాటు తెలంగాణలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. రాష్ట్రంలోని అనేక జిల్లాలు మళ్లీ వర్ష బీభత్సాన్ని ఎదుర్కొనే అవకాశముందని అధికారులు తెలిపారు. తెలంగాణలో వర్షాల ప్రభావం కొనసాగుతూనే ఉంది. అల్పపీడనం కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా మరో రెండు రోజుల పాటు అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది.



## ఆలస్యంగా విధులకు ఉద్యోగులు

### చర్యలు తప్పవని హెచ్చరించిన మంత్రి తుమ్మల

**హైదరాబాద్, ఆగస్టు 28 :** ఉద్యోగులు తరచూ ఆలస్యంగా విధులకు రావడంపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. సచివాలయంలో తన మంత్రిత్వ శాఖ పరిధిలోని శాఖలు మరియు కార్పొరేషన్ల ఉద్యోగుల హాజరుపై మంత్రి తుమ్మల సమీక్ష నిర్వహించారు. ఉదయం 10.40 వరకు కూడా తమ విధులకు హాజరుకాక పోవడంపై మంత్రి తుమ్మల ఆగ్రహం వ్యక్తం చేశారు. హాజరుకాని ఉద్యోగుల నుండి వివరణ తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రేపటి నుండి ఉద్యోగులంతా ఉదయం 10.30 గంటలకు వరకు విధులకు హాజరుకావాలని, హాజరుకాని ఉద్యోగులపై శాఖ పరమైన చర్యలు తీసుకుం టామని హెచ్చరించారు. ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ఉద్యోగులంతా రైతులకు అందుబాటులో ఉండేవిధంగా పనిచేయాలని, రైతులకు కావాల్సిన టార్పలిన్లు అందుబాటులో ఉంచాలని, పంటలు తడవకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. యూరియా పరిస్థితులపై సమీక్ష నిర్వహించిన మంత్రి.. రాష్ట్రానికి వస్తున్న యూరియాను డిమాండ్ ఎక్కువగా ఉన్న జిల్లాల వారిగా కేటాయించాలని, అలాగే నిన్న జిల్లాలలో కురిసిన భారీ వర్షాలకు జరిగిన పంట నష్టం వివరాలు త్వరగా సేకరించాలని వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపిని ఆదేశించారు.

## సికింద్రాబాద్-తిరుపతి వందేభారత్

### 20కి పెరగనున్న కోచ్‌ల సంఖ్య

**హైదరాబాద్,ఆగస్టు 28 :** వందేభారత్‌కు లభిస్తున్న ఆదరణ నేపథ్యంలో రైల్వే బోర్డు కీలక నిర్ణయం తీసుకుంది. సికింద్రాబాద్-తిరుపతి సహా ఏడు మార్గాల్లో నడిచే వందేభారత్ రైళ్ల కోచ్‌ల సంఖ్యను పెంచాలని నిర్ణయించింది. దీంతో కోచ్‌ల సంఖ్య 20కి పెరగనుంది. సికింద్రాబాద్-తిరుపతి సహా మంగళూరు సెంట్రల్-తిరువనంతపురం, చెన్నై ఎగ్మోర్-తిరునల్వేలి మార్గాల్లో ప్రస్తుతం 16 కోచ్‌ల వందేభారత్ నడుస్తుండగా.. దీనిని 20 కోచ్‌లకు పెంచనున్నారు. మిగతా నాలుగు మార్గాల్లో ఎనిమిది కోచ్‌ల రైళ్లు నడుస్తుండగా.. వాటి స్థానంలో 16 కోచ్‌లు అందుబాటు-లోకి రానున్నాయి. ఈ ఏడు మార్గాల్లో కోచ్‌ల అప్‌గ్రేడ్‌తోపాటు-మరిన్ని 20 కోచ్‌ల వందేభారత్ రైళ్లు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని రైల్వే అధికారులు పేర్కొన్నారు. కొత్తగా వచ్చే 16, 8 కోచ్‌ల రైళ్లను కొత్త మార్గాల్లో ఉపయోగిస్తామన్నారు. సికింద్రాబాద్-తిరుపతి, మంగళూరు సెంట్రల్- తిరువనంతపురం, చెన్నై ఎగ్మోర్-తిరునల్వేలి, మదురై-బెంగళూరు కంటోన్మెంట్, దేవ్‌గఢ్-వారణాసి, హవ్‌డా-రౌర్కెలా, ఇండోర్-నాగ్‌పూర్ మధ్య నడిచే వందేభారత్ రైళ్లలో ఎక్కువ కోచ్‌లు అందుబాటు-లో ఉండనున్నాయి.ప్రస్తుతం మూడు మార్గాల్లో 16 కోచ్‌లు, నాలుగు రూట్‌లలో ఎనిమిది కోచ్‌ల వందేభారత్ రైళ్లు నడుస్తున్నట్లు-అధికారులు వెల్లడించారు. 16 కోచ్‌ల రైలును 20 కోచ్‌లతో, ఎనిమిది కోచ్‌ల రైళ్ల స్థానంలో 16 కోచ్‌లకు అప్‌గ్రేడ్ చేయనున్నట్లు- రైల్వే బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ప్రజా సంబంధాలు) దిలీప్ కుమార్ వెల్లడించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో (జులై 31, 2025 నాటికి) వందేభారత్ రైళ్ల రద్దీ సమాచారాన్ని పరిగణనలోకి తీసుకొని వీటిని అందుబాటు-లో ఉంచేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు.

## చనిపోయిన వారి కుటుంబాలను ఆదుకోవాలి

### పునరావాస బాధితులను పరామర్శించిన ఎంపి రఘునందన్

**మెదక్, ఆగస్టు 28 :** వరదల్లో చనిపోయిన వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు డిమాండ్ చేశారు. వరదల్లో నష్టపోయిన వారిని కూడా ఆదుకోవాలన్నారు. విద్యుత్ పునరుద్ధరణ పనులు తోణం చేపట్టాలన్నారు. మెదక్‌లోని జీకేఆర్ ఫంక్షన్ హాలులో ఏర్పాటు-చేసిన పునరావాస కేంద్రంలో వరద బాధితులను పరామర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. పోచారంలో ఇద్దరు వ్యక్తులు గల్లంతయ్యారు. వారిలో ఒకరి మృతదేహం లభ్యమైంది.. మరొకరి కోసం ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు గాలిస్తున్నాయి. మెదక్‌జిల్లాలో పునరుద్ధరణ పనుల కోసం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వివేక్ రూ. కోటి వరద సాయం ప్రకటించారు. మెదక్ పట్టణంలోని పిల్లికొట్టాల సబ్‌స్టేషన్ పూర్తిగా నీట మునిగింది. ఆ ఒక్క సబ్ స్టేషన్ పునరుద్ధరించాలంటేనే రూ.3 కోట్లు- ఖర్చవుతాయి. రహదారులు కొట్టుకుపోయాయి, అనేక మంది ఇళ్లు కోల్పోయి నిరాశ్రయులయ్యారు. లోతట్టు ప్రాంతాలన్నీ ఇంకా జలదిగ్బంధంలోనే ఉన్నాయి. విపత్తు సాయం పెంచాలని, మృతుల కుటుంబాలకు రూ.50లక్షల చొప్పున పరిహారం, వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేసారు. రాష్ట్ర ప్రభుత్వం హెలికాప్టర్ పంపడంలో ఆలస్యం కావడం వల్లే ఆ ఇద్దరు చనిపోయారని గ్రామస్థులు బాధపడుతున్నారు. రామాయంపేట- సిద్దిపేట మధ్య జాతీయ రహదారిలో నందిగామ వద్ద పాత బ్రిడ్జినే జాతీయ రహదారికి అనుసంధానించడం వల్ల అది దెబ్బతిని రాకపోకలకు ఆటంకమేర్పడింది. పాత బ్రిడ్జి స్థానంలో కొత్త బ్రిడ్జి నిర్మించాలని రఘునందన్‌రావు డిమాండ్ చేశారు.

# క్రీడా ప్రపంచానికి హైదరాబాద్ దిక్సూచిగా మారాలి

- జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో తెలంగాణ నిలవాలి
- క్రీడా విధానం, క్రీడల ప్రోత్సాహం విషయంలో మన వైపే చూడాలి
- గ్రామ స్థాయి నుంచి క్రీడాకారులకు తర్ఫీదు
- అన్ని రకాల వసతులు, బడ్జెట్ కేటాయింపులకు సిద్ధం
- తెలంగాణ స్పోర్ట్స్ హబ్ బోర్డు మొదటి సమావేశంలో సీఎం రేవంత్



**హైదరాబాద్, ఆగస్ట్ 28 :** క్రీడా ప్రపంచానికి హైదరాబాద్ దిక్సూచిగా మారాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. తెలంగాణకు ఐటీ, సంస్కృతి ఉందని... రాష్ట్రంలోని ప్రతి కుటుంబం తమ పిల్లలు ఐటీ రంగంలో ఉండాలనుకుంటున్నారని... అలా కాకుండా క్రీడా సంస్కృతి కూడా రావాలని తాను అభిలషిస్తున్నట్టు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఖేలో ఇండియా, కామన్‌వెల్త్, ఒలింపిక్స్ ఇలా ఏ పోటీలు నిర్వహించినా వాటిలో తెలంగాణకు అవకాశం కల్పించాలని తెలంగాణ స్పోర్ట్స్ హబ్ తీర్మానం చేసింది. రాష్ట్రంలో స్టేడియాల నిర్వహణ, వసతులు మెరుగుపర్చడం, కోచ్‌లు, ట్రైనర్లకు శిక్షణ, క్రీడా పాలసీలో వివిధ అంశాలపై ప్రణాళిక రూపకల్పన, అమలుకు సబ్‌మిటీల ఏర్పాటుకు బోర్డు తీర్మానాలు చేసింది. తెలంగాణ స్పోర్ట్స్ హబ్ బోర్డు మొదటి సమావేశం హైదరాబాద్‌లో గురువారం జరిగింది. సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడా విధానం, క్రీడల ప్రోత్సాహం విషయంలో ప్రతీ ఒక్కరూ హైదరాబాద్ గురించి మాట్లాడుకోవాలన్నదే తన లక్ష్యమన్నారు. క్రీడా రంగం ప్రోత్సాహానికి గాను గతంతో పోల్చితే 16 రెట్లు బడ్జెట్ పెంచామని సీఎం వివరించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులకు ప్రోత్సాహకాలు ఇవ్వడంతో పాటు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించామని తెలిపారు. క్రీడా రంగం ప్రాధాన్యతను పెంచేందుకు యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని చెప్పారు. హైదరాబాద్‌తో పాటు తెలంగాణ వ్యాప్తంగా పెద్ద ఎత్తున స్టేడియాలు, అధునాతన పరికరాలు అందుబాటులో ఉన్నా ఆశించిన స్థాయిలో ఫలితాలు లేవని, వాటిని సమగ్రంగా సద్వినియోగం చేసుకోవడముతో పాటు క్రీడా రంగంలో తెలంగాణను అగ్రగామిగా నిలిపేందుకు బోర్డు తగిన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సీఎం కోరారు. క్రీడా రంగం అభివృద్ధికి నిధులు, నిపుణులు, నిర్వహణ అవసరమైనందునే బోర్డులో ప్రముఖ కార్పొరేట్లు, క్రీడాకారులు, క్రీడా నిర్వాహకులకు చోటు కల్పించామని సీఎం తెలిపారు. ఇప్పటివరకు ఉన్న క్రీడా పోటీల విధానాన్ని మార్చుతూ గ్రామ, మండల, శాసనసభ నియోజకవర్గ స్థాయి పోటీలు నిర్వహిస్తామన్నారు. శాసనసభ నియోజకవర్గ స్థాయిలో విజేతలుగా నిలిచిన జట్ల మధ్య పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి పోటీలు నిర్వహించి, అంతిమంగా రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించి రాష్ట్ర స్థాయి జట్లను ఎంపిక చేస్తామన్నారు. క్రీడా సామగ్రిపై ఉన్న పన్నుల తగ్గింపునకు కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడతామని... తమ స్థాయిలో అవసరమైన ప్రోత్సాహకాలు అందిస్తామని తెలిపారు. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీలో ఫిజియోథెరపీ, ఇతర క్రీడా సంబంధిత కోర్సులు ప్రవేశపెడతామని బోర్డు సభ్యులకు తెలియజేశారు. స్టేడియాలు పెద్ద సంఖ్యలో ఉన్నా తగిన సంఖ్యలో కోచ్‌లు లేరని, ఉన్న కోచ్‌లకు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలకు తగినట్లు శిక్షణ ఇవ్వాల్సి ఉందన్నారు. రానున్న మూడేళ్లలో మనం సాధించాల్సిన లక్ష్యాలపై బోర్డు తగిన కార్యాచరణ రూపొందించాలని సీఎం సూచించారు.

**ఇతర ప్రముఖుల అభిప్రాయాలు :**

- ఇండియా క్రికెట్ టీమ్ మాజీ కెప్టెన్ కపిల్ దేవ్ మాట్లాడుతూ, తొలుత క్రీడా సంస్కృతిని పెంపొందించాలి. ప్రతి విద్యార్థి ఏదో ఒక క్రీడలో పాల్గొనేలా చూస్తే ఫలితాలు వాటంతటవే వస్తాయని అభిప్రాయపడ్డారు. హర్యానాలో కుస్తీతో ప్రతి క్రీడకు పల్లెల్లో చోటు ఉందని గుర్తు చేశారు.
- ప్రముఖ షూటర్ అభినవ్ బింద్రా మాట్లాడుతూ, ప్రతి పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడు, వ్యాయామ సంచాలకుడు ఉండేలా చూడాలన్నారు.
- ఆధానీ ఫౌండేషన్ శతాధానీ మాట్లాడుతూ, పాఠశాల స్థాయిలోనే క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని, వ్యాయామ అక్షరాస్యతపై అవగాహన పెంపొందించాల్సి ఉందన్నారు.
- బ్యాడ్మింటన్ క్రీడాకారుడు పుల్లెల గోపీచంద్ మాట్లాడుతూ, గ్రామ స్థాయి నుంచి క్రీడా పోటీలు దశలవారీగా ఉండాలని, అప్పుడు మెరుగైన క్రీడాకారుల ఎంపిక సాధ్యమవుతుందని అన్నారు.
- హబ్ కో ఛైర్‌పర్సన్ ఉపాసన కొణిదెల మాట్లాడుతూ, ఫిజియోథెరపిస్ట్ కోర్సులను క్రీడా యూనివర్సిటీలో ప్రారంభించాలని కోరారు. అలాగే, స్పోర్ట్స్ సామగ్రిపై పన్నుల భారం భారీగా ఉందని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు.
- హబ్ ఛైర్‌పర్సన్ డాక్టర్ సంజీవ్ గోయెంకా మాట్లాడుతూ, ప్రపంచ ప్రముఖ కంపెనీల సీఈవోలు ఈ ప్రాంతం నుంచే ఉన్నందున వారి సేవలను క్రీడాభివృద్ధికి వినియోగించుకోవాలన్నారు.
- విశ్వ సముద్ర ఫౌండేషన్ చింతా శశిధర్ మాట్లాడుతూ, క్రీడల్లో రాణించే వారికి అవసరమైన సామగ్రిని పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచితే మరింత మెరుగైన ఫలితాలు వస్తాయని అన్నారు.
- క్రీడా నిర్వాహకులు బియ్యాల పాపారావు మాట్లాడుతూ, ఐఐటీ ప్రొఫెసర్ల మాదిరిగా స్పోర్ట్స్ యూనివర్సిటీలో కోచ్‌లు ఉండాలన్నారు.
- ఫుట్‌బాల్ టీమ్ మాజీ కెప్టెన్ బైచుంగ్ భుటియా మాట్లాడుతూ, గ్రామ స్థాయిలో స్టేడియాలు, క్రీడా సామగ్రి అందుబాటులో ఉంటే క్రీడాకారులు వెలుగులోకి వస్తారని తెలిపారు. ఇంగ్లాండ్‌లో ప్రతి ఆటకు లీగ్స్ ఉంటాయని, అలాగే మన దగ్గర కూడా ప్రతి ఆటకు లీగ్స్ ఉండాలన్నారు.
- ప్రముఖ క్రీడాకారుడు రవికాంత్ రెడ్డి మాట్లాడుతూ, మనకు ఉన్న స్టేడియాలను మెరుగ్గా వినియోగించుకోవాలని, వాటి నిర్వహణ సక్రమంగా చేయాలని సూచించారు.

సమావేశంలో క్రీడా వ్యవహారాల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనారెడ్డి, ఎండీ సోని బాలదేవి పాల్గొన్నారు.

## భారీ వర్షాలతో పలుచోట్ల రోడ్లకు గండ్లు

- రోడ్లు దెబ్బతిన్న ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు
- తక్షణ పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలి
- మంత్రి కోమటిరెడ్డి ఆదేశం



**హైదరాబాద్, ఆగస్ట్ 28 :** భారీ వర్షాలతో పలుచోట్ల రోడ్లకు గండ్లు పడ్డందున, రోడ్లు దెబ్బతిన్న ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, తక్షణ పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా అధిక వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో, రాష్ట్ర రోడ్లు-భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆర్అండ్‌బి అధికారులను అలర్ట్‌గా ఉండాలని ఆదేశించారు. గురువారం ఆర్అండ్‌బి అధికారులతో మంత్రి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో క్షేత్ర స్థాయి పరిస్థితులను ఆర్అండ్‌బి శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా మెదక్, సంగారెడ్డి, కామారెడ్డి, సిరిసిల్ల, నిర్మల్ జిల్లాల్లో పరిస్థితులపై సమీక్షించిన మంత్రి, కాజ్‌వేలు, కల్వర్టులు, బ్రిడ్జిలు, కోతకు గురైన రోడ్ల వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. కామారెడ్డి, నిర్మల్ వద్ద వరద ప్రవాహానికి హై-44 పై రాకపోకలకు ఏర్పడిన అంతరాయం, ట్రాఫిక్ క్లియరెన్స్‌పై మంత్రి ఆరా తీశారు. నేషనల్, స్టేట్ హైవేలు తదితర రహదారుల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటి వరకు ఈ సీజన్‌లో అధిక వర్షాల వల్ల పాడైన రోడ్లు, కల్వర్టులు, ముఖ్యంగా ఇంకా రెడ్ అలెర్ట్ ఉన్న జిల్లాల రోడ్ల వివరాలను అధికారులు మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రోడ్లు తెగిన చోట, కల్వర్టులు పొంగిపొర్లుతున్న చోట, వాగులు ఉధృతంగా ప్రవహించే మైనర్ బ్రిడ్జుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజా రవాణాకు ఇబ్బంది లేకుండా చూడాలని, తెగిన రోడ్లు, కల్వర్టుల వద్ద వర్షాలు తగ్గిన వెంటనే తాత్కాలిక మరమ్మతులు చేపడతామని అన్నారు. ప్రత్యామ్నాయ మార్గాల్లో ట్రాఫిక్‌ను మళ్లించాలని అధికారులకు సూచించారు. ప్రాణనష్టం జరగకుండా పోలీస్, ఎలక్ట్రిసిటీ, ఇరిగేషన్, పంచాయతీరాజ్, రెవెన్యూ శాఖలతో సమన్వయం చేసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. దెబ్బతిన్న రోడ్లు, వంతెనలకు సంబంధించి శాశ్వత నిర్మాణాల కోసం ప్రతిపాదనలు రూపొందించాలని ఆదేశించారు. గత రివ్యూలో మంత్రి ఇచ్చిన ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా 37 ఆర్ అండ్ బి డివిజన్ల నుండి సమాచారం సేకరిస్తున్నామని, 24 గంటలు అలర్ట్‌గా ఉంటున్నామని స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్ మంత్రికి తెలిపారు. గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన వరద ప్రవాహాలకు ఆర్ అండ్ బి పరిధిలోని 37 డివిజన్లలో 794 చోట్ల సమస్యాత్మక రహదారులను గుర్తించామని, అందులో 1039 కి.మీ రోడ్లు దెబ్బతిన్నాయని తెలిపారు. 31 చోట్ల రహదారులు తెగిపోగా, వెంటనే 10 చోట్ల తాత్కాలిక పునరుద్ధరణ చేపట్టామని వెల్లడించారు.

## నష్టాలపై ప్రాథమిక అంచనా వేయండి

- నష్టాలపై నివేదికలు వెంటనే సమర్పించండి
- సంబంధిత శాఖల అధికారులకు సిఎస్ సూచన



**హైదరాబాద్, ఆగస్ట్ 28 :** రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలు, వరదల వల్ల జరిగిన నష్టాన్ని అంచనా వేసి ప్రాథమిక నివేదికను వెంటనే సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామ కృష్ణారావు సంబంధిత శాఖల కార్యదర్శులను ఆదేశించారు. రాష్ట్రంలో గత కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలవలన జరిగిన నష్టాలపై వివిధ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులతో గురువారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యద ర్శులు అరవింద్ కుమార్, వికాస్ రాజ్, సబ్యసాచి ఘోష్, ముఖ్య కార్యదర్శులు రాహుల్ బొజ్జ, రఘునందన్ రావు, శ్రీధర్ , పోలీస్ శాఖ ఉప మరియు అడిషనల్ డీజీ మహేష్ భగవత్ తదితర ఉన్నతాధికారులు ఈ టెలీ కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సి.ఎస్ మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రధానంగా నిర్మల్, కామారెడ్డి, మెదక్, సిరిసిల్ల జిల్లాలు అధికంగా నష్టాన్ని చవి చూశాయని, వీటితో పాటు- ఇతర జిల్లాల్లో కూడా గణనీయమైన నష్టం వాటిల్లిందని అన్నారు. ఈ నష్టాలకు సంబంధించి ప్రాథమిక నివేదికను వెంటనే సమర్పించాలన్నారు. ఈ ప్రాథమిక నివేదికలతో పాటు- జరిగిన నష్టాలను తెలియచేసే ఫోటోలు,వీడియో క్లిప్పింగులు, పత్రిక క్లిప్పింగులు కూడా జతపర్చాలని సి.ఎస్ పేర్కొన్నారు. వివిధ శాఖల కార్యదర్శులు, సంబంధిత జిల్లా కలెక్టర్లు నష్టాలపై పంపిన ఈ ప్రాథమిక నివేదికలను సంకలనం చేయాలని విపత్తుల నిర్వహణ శాఖకు తెలిపారు. ఇప్పటికే పలు జిల్లాల్లో భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు, చెరువులు, విద్యుత్ లైన్లను యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించాలని రామకృష్ణారావు ఆదేశించారు. వర్షాలు మరికొన్ని రోజులు వచ్చే అవకాశం ఉన్నందున మరింత అప్రమత్తతతో ఉండాలని స్పష్టం చేశారు. దురదృష్టవశాత్తు మరణించిన వారి కుటు-ంబాలకు నిబంధనలను అనుసరించి ఎక్స్ గ్రేషియా ను అందచేయాలని అన్నారు. గౌరవ ముఖ్యమంత్రివర్యులు పూర్తి స్థాయిలో సమీక్షించనున్నందున సంబంధిత శాఖలన్ని వివరాలతో, తీసుకున్న చర్యల నివేదికలతో సిద్ధంగా ఉండాలని కోరారు.

## కామారెడ్డి వరద ప్రాంతాల్లో మంత్రి సీతక్క పర్యటన

### బాధితులకు తక్షణ సాయం అందించాలని ఆదేశం

**కామారెడ్డి, ఆగస్ట్ 28 :** జిల్లాలో వరద ప్రభావిత ప్రాంతాలను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క పరిశీలించారు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించి అన్ని సదుపాయాలు కల్పించాలని అన్నారు. పునరావాస కేంద్రాల్లో ఆహారం, మంచినీరు, వైద్య సేవలు నిరంతరం అందుబాటులో ఉంచాలని, అధికారులు క్షేత్రస్థాయిలో ఉండి ప్రజలకు భరోసా కల్పించాలని అధికారులకు సూచించారు. ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణ ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యతనిస్తుందని అధికారులు వరద ప్రభావిత ప్రాంతాల్లో ఉండి ప్రతి కుటుంబానికి అవసరమైన సాయం అందించాలన్నారు. ఈ పర్యటనలో ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్, జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కర్ జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ పాల్గొన్నారు. వరుసగా కురుస్తున్న అధిక వర్షాల కారణంగా ముంపునకు గురైన కామారెడ్డి పట్టణంలోని జి.ఆర్ కాలనీని మంత్రి స్వయంగా పరిశీలించారు. స్థానిక ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ వరద ప్రభావిత ప్రాంతాల్లో రవాణా అంతరాయాలు, విద్యుత్ సమస్యలు, త్రాగునీటి సరఫరాను పునరుద్ధరించాలన్నారు. సహాయక చర్యలు నిరంతరంగా కొనసాగుతాయన్నారు. ప్రభుత్వం, అధికారుల అప్రమత్తత వల్ల ప్రాణనష్టాన్ని నివారించగలిగామని, వరద ముంపులో చిక్కుకున్న చాలామందిని రక్షించామనిసీఎం గారు



వర్షాలు వరదల మీద వరుస సమీక్షలు నిర్వహిస్తూ మంత్రులను, అధికార యంత్రాంగాన్ని గైడ్ చేస్తున్నారన్నారు. అర్ధరాత్రి అకస్మాత్తుగా క్లౌడ్ బరస్ట్ జరగటం వల్ల వరద ఉధృతి పెరిగిందని, వర్షాల వల్ల జరిగిన నష్టాన్ని అంచనా వేస్తున్నామని బాధితులు ఆందోళన చెందకుండా ధైర్యంగా ఉండాలని ప్రభుత్వం తప్పకుండా ఆదుకుంటు-ందన్నారు. ప్రభుత్వం వరద బాధితులకు స్థానిక అధికారుల ద్వారా ఆహారాన్ని సరఫరా చేస్తున్నామని ప్రకృతి విపత్తుల సమయంలో రాజకీయాలు చేయకుండా ఎవరికి తోచినట్టు-గా వారు బాధితులకు అండగా ఉండాలని, లోతట్టు- ప్రాంతాల ప్రజలు దయచేసి పునరావాస కేంద్రాల్లోకి వెళ్లాలని కోరారు. ఎలాంటి విపత్కాల పరిస్థితులు తలెత్తిన ఎదుర్కునేందుకు ప్రభుత్వ యంత్రాంగమంతా సిద్ధంగా ఉందన్నారు.

## విద్యాసంస్థలకు సెలవుల ప్రకటన

**హైదరాబాద్,ఆగస్టు 28 :** రాష్ట్రంలోని పలు జిల్లాల్లో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో 13 జిల్లాల్లో పాఠశాలలకు విద్యాశాఖ సెలవులు ప్రకటించింది. నల్లగొండ, యాదాద్రి భువనగిరి, కరీంనగర్, సిద్దిపేట, జగిత్యాల, సిరిసిల్ల,కామారెడ్డి, మెదక్, నిర్మల్, ఆదిలాబాద్, కొమురం భీమ్ ఆసిఫాబాద్, నిజామాబాద్, ఖమ్మం జిల్లాల్లో జిల్లాల్లో ప్రభుత్వ, ప్రైవేటు- విద్యాసంస్థలకు అధికారులు సెలవు ప్రకటించారు. భారీ వర్షాల నేపథ్యంలో అత్యవసరమైతే తప్ప ప్రజలు బయకు రాకూడదని అధికారులు సూచించారు. వర్ష ప్రభావం కారణంగా కామారెడ్డి జిల్లాలోని అన్ని విద్యాసంస్థలకు ఆగస్టు 29, 30 వరకు సెలవులు ప్రకటించినట్లు- ప్రభుత్వం తెలిపింది. భారీ వర్షాల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం సెలవులను మరో రెండు రోజులు పొడిగించింది. అందువల్ల పాఠశాలలు, కళాశాలలు బంద్ కానున్నాయి.

## కాకతీయ పరిధిలో పరీక్షలు వాయిదా

**వరంగల్, ఆగస్టు 28 :** పలు జిల్లాల్లో ఇప్పటికే పాఠశాలలు, కళాశాలలకు సెలవులు ప్రకటించారు. ఈ నేపథ్యంలో కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలో ఆగస్టు 28, 29 తేదీల్లో జరగాల్సిన డిగ్రీ, పీజీ పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు- రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రాజేందర్ ప్రకటించారు. వర్షాల కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నామని, మిగిలిన పరీక్షలు షెడ్యూల్ ప్రకారం యథావిధిగా కొనసాగుతాయని తెలిపారు. వాయిదా వేసిన పరీక్షల కొత్త తేదీలను త్వరలో ప్రకటిస్తామని స్పష్టం చేశారు. అదేవిధంగా, కరీంనగర్‌లోని శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో గురువారం జరగాల్సిన బీఎడ్, ఎంఎడ్ పరీక్షలు కూడా వాయిదా పడ్డాయి. వర్షాల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నామని అధికారులు వెల్లడించారు. మిగతా పరీక్షలు యథావిధిగా జరుగుతాయని స్పష్టంచేశారు. ఇక రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ మోడల్ స్కూల్స్‌లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం స్పాట్ అడ్మిషన్లు చేపట్టనున్నట్లు- పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ తెలిపారు. 2025-26 విద్యాసంవత్సరానికి ఆరు నుంచి పదో తరగతి వరకు అడ్మిషన్ల కోసం ప్రవేశ పరీక్షలు నిర్వహించినా, ఇంకా సుమారు 48,630 సీట్లు ఖాళీగా ఉన్నట్లు గుర్తించామని ఆయన వెల్లడించారు. ఇంటర్ రెండో సంవత్సరం 13,256 సీట్లు-, ఇంటర్ ఫస్ట్ ఇయర్ 12,668 సీట్లు-, ఆరో తరగతి 7,543 సీట్లు-, ఏడో తరగతి 5,192 సీట్లు-, ఎనిమిదో తరగతి 3,936 సీట్లు-, తొమ్మిదో తరగతి 2,884 సీట్లు-, పదో తరగతి 3,151 సీట్లు- ఖాళీగా ఉన్నట్లు- వివరించారు.

# గోదావరి జలాల తరలింపులో శ్రీపాద ఎల్లంపల్లి కీలకం

- మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం ప్రాజెక్టుల్లో నీరు నిల్వ అసాధ్యం
- నిర్మాణ, నిర్వహణ లోపాలే కారణం : సీఎం రేవంత్ రెడ్డి
- అల్లుడు స్వాతిముత్యం.. మామ ఆణిముత్యం అంటూ సెటైర్లు
- వరద ప్రభావిత ప్రాంతాల్లో సీఎం ఏరియల్ సర్వే




**పెద్దపల్లి, ఆగస్టు 28 :** గోదావరి జలాలను తెలంగాణలో ఎక్కడికి తరలించాలన్నా శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు కీలకమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌లతో కలిసి వరద ప్రభావిత ప్రాంతా ల్లో ఏరియల్ సర్వే నిర్వహించారు. కామారెడ్డి, మెదక్, సిద్దిపేట, నిజామాబాద్, పెద్దపల్లి జిల్లాల్లో వచ్చిన భారీ వర్షాల కార ణంగా అనేక ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి గురువారం వరద ప్రభావిత ప్రాంతాల్లో హెలికాప్టర్ ద్వారా ఏరియల్ సర్వే చేశారు. అనంతరం శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టును పరిశీలించారు. ప్రాజెక్టు వద్ద వరద ప్రవాహం పరిస్థితిని చూసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఎల్లంపల్లి ప్రాజెక్టు స్ట్రాటజిక్ స్థితిలో ఉండటం వల్లే ఇప్పటికీ నిలబడిందని చెప్పారు. కూలిపోయిన ప్రాజెక్టు, నిలబడిన ప్రాజెక్టు మధ్య తేడా ఇది అన్నారు. నిపుణులు రూపొందించిన ప్రాజెక్టు కావడమే ఎల్లంపల్లి నిలకడగా ఉన్నదని చెప్పారు. అదే సమయంలో మేడిగడ్డ పనికిరా కుండా పోయిందని, దానిని బదులు అన్నారం, సుందిళ్లలో నీరు నిల్వ చేయలేమా? అనే మీడియా ప్రశ్నకు స్పందిస్తూ, "ఇది సాధ్యం కాదు," అని చెప్పారు.

### అల్లుడు స్వాతిముత్యం.. మామ ఆణిముత్యం

మామ, అల్లుడు రాజకీయాలు గుర్తు చేస్తూ, "ఒకరు స్వాతిముత్యం, మరొకరు ఆణిముత్యం అనుకుంటున్నారు" అంటూ సెటైర్లు వేశారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల మూడు బ్యారేజీలు ఒకే విధమైన సాంకేతికతతో నిర్మించబడ్డాయి. మూడింటిలోనూ నిర్మాణం, నిర్వహణ లోపాలు ఉన్నట్లు గుర్తించారు. ఏదైనా ప్రమాదం జరిగితే, గ్రామాలే తుడిచిపోతాయి అని హెచ్చరించారు. తాము 80వేల పుస్తకాలు చదవలేదన్న సీఎం, కానీ చదివిన వారిని సలహా అడుగుతున్నామని పేర్కొన్నారు.

### మేడిగడ్డపై సాంకేతిక కమిటీ సూచనలు అనుసరిస్తాం

మేడిగడ్డపై సాంకేతిక కమిటీ సూచనలు ఎలా ఉన్నాయో అనుసరిస్తా మని తెలిపారు. కాళేశ్వరం కమిషన్ నివేదికపై అసెంబ్లీలో చర్చ చేసి ముందుకెళతామని స్పష్టం చేశారు. తీవ్ర వర్షాల వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అధికారులతో వివరాలు తెలుసుకుని సూచనలు అందించారు. కామారెడ్డిలోని పరిస్థితిని ప్రత్యేకంగా పరిశీలించారు. శ్రీపాద ఎల్లంపల్లి గోదావరి జలాల గుండె కాయగా పేర్కొన్నారు. "మామ, అల్లుడు ఎన్ని కుట్రలు చేసినా పాపాలు పోవు" అని విమర్శించారు. "నీళ్లు నిల్వ చేస్తే గ్రామాలే కొట్టుకుపోతాయని" ప్రజలకు వివరించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లలో నిర్మాణ వైఫల్యం, డిజైన్ లోపాలు ఉన్నాయని సీఎం వెల్లడించారు. ఎల్లంపల్లి నుంచి కామారెడ్డికి బయలుదేరిన సీఎం బృందం, అక్కడ ముంపు ప్రాంతాలు పరిశీలించింది. మూడు బ్యారేజీల్లో నీటి నిల్వ లిలిఎత్తిపోత పద్ధతికి అనుకూలం కాదని చెప్పిందని పేర్కొన్నారు. నీరు నిల్వ చేసిన తర్వాత ప్రాజెక్టు కూలిపోతే, గ్రామాలే ముంపుకావొచ్చని" హెచ్చరించారు. కాళేశ్వరం కమిషన్ నివేదికపై అసెంబ్లీలో చర్చించుతామని ముఖ్యమంత్రి రేవంత్ స్పష్టం చేశారు.

## సహాయకచర్యలకు హెలికాప్టర్లు

### ఆర్మీ హెలికాప్టర్లు పంపాలను బండి ఆదేశం



**కరీంనగర్, ఆగస్ట్ 28 :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలకు పలు జిల్లాలు అతలాకుతలం అవుతున్నాయి. భారీ వర్షాల కారణంగా లోతట్టు- ప్రాంతాల ప్రజలు వరదల్లో చిక్కుకున్నారు. ఈ నేపథ్యంలో వరదల్లో ఉన్నవారిని రక్షించడానికి రాష్ట్రానికి మూడు ఆర్మీ హెలికాప్టర్లు రావాల్సి ఉంది. హెలికాప్టర్లు ఎంతకు రాకపోయే సరికి రక్షణ శాఖ అధికారులకు కేంద్ర మంత్రి బండి సంజయ్ ఫోన్ చేసి సమాచారం తెలుసుకున్నారు. హెలికాప్టర్లను సిద్ధం చేసినట్లు- కేంద్ర రక్షణ శాఖ అధికారులు చెప్పారని తెలిపారు. ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో బాధిత ప్రాంతాలకు చాపర్లు రావడంలో ఆలస్యమవుతోందని వివరించారు. ప్రత్యామ్నాయ స్టేషన్ల నుంచి చాపర్లను రప్పించేందుకు చర్యలు చేపడుతు న్నట్లు పేర్కొన్నారు. నాందెడ్, బీదర్ స్టేషన్ల నుంచి చాపర్లను పంపేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నట్లు బండి సంజయ్ స్పష్టం చేశారు. భారీ వర్షాలతో ఎస్సారెస్పీ, మానేరు నదులకు విపరీతంగా వరద వస్తోందని పేర్కొన్నారు. వరద ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షితంగా తరలించే పక్రియను రాష్ట్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన తీసుకుని చర్యలు చేపట్టాలన్నారు. సహాయక చర్యలకు పూర్తి సహాయ సహకారాలు అందించేందుకు ఎన్డీఆర్ఎఫ్ టీంలు నిమగ్నమయ్యాయని ఆయన చెప్పుకొచ్చారు. వీలైనంత తొందరగా చాపర్లను పంపాలని కేంద్ర ప్రభుత్వాన్ని బండి సంజయ్ కోరారు. రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల దృష్ట్యా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. ముప్పు ప్రాంతాల వారిని అధికారులు పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. ఏదైనా సమస్య ఎదురైతే.. వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. అత్యవసరం అయితే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావొద్దని బండి సంజయ్ సూచిస్తున్నారు. తెలంగాణకు ఆర్మీ హెలికాప్టర్ల రాక ఆలస్యంపై రక్షణ శాఖ అధికారులకు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఫోన్ చేశారు. తెలంగాణకు మూడు హెలికాప్టర్లను రెడీగా ఉంచామని కేంద్ర రక్షణ శాఖ అధికారులు తెలియజేశారు. ఎడతెరిపిలేకుండా వర్షాలు కురుస్తుండటంతో వాతావరణం అనుకూలించక పోవడంతో బాధిత ప్రాంతాలకు చాపర్ల రాక ఆలస్యమవుతోందని అధికారులు వివరించారు. ప్రత్యామ్నాయ స్టేషన్ల నుండి చాపర్లను రప్పించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారని పేర్కొన్నారు. నాందేడ్, బీదర్ స్టేషన్ల నుండి చాపర్లను పంపేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. భారీ వర్షాలతో ఎస్సారెస్పి, మానేరు నదులకు విపరీతంగా వరద వస్తోందని బండి సంజయ్ చెప్పారు. వరద ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షితంగా తరలించే పక్రియను రాష్ట్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన తీసుకునే చర్యలకు పూర్తి సహాయ సహకారాలు అందించేందుకు

## ఖమ్మంలో పొంగుతున్న వాగులు

**ఖమ్మం, ఆగస్టు 28 :** ఖమ్మం జిల్లా కొణిజర్లలో భారీ వర్షం కురిసింది. ఈ ప్రభావంతో పగిడేరు, నిమ్మవాగు, జన్నారం ఏరు, రాళ్లవాగు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. కొణిజర్ల, మల్లుపల్లి మధ్య రోడ్డు పైనుంచి పగిడేరు ప్రవహిస్తుండటంతో కొణిజర్ల, ఏన్కూరు మండలాల రాకపోకలు నిలిచిపోయాయి. కొణిజర్ల, పెద్దమునగాల, పెద్దగోపతి, గుబ్బగుర్తి చెరువులు అలుగు పారుతున్నాయి. వాగుల ఉధృతితో ఆ పరిసర ప్రాంతాల్లోని పంటలు నీట మునిగాయి. తీవ్రంగా నష్టపోయినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొణిజర్ల మండలంలో 120 మిల్లీమీటర్ల వర్షం కురిసినట్లు- అధికారులు వెల్లడించారు.

## వరదల్లో చిక్కుకున్న ఐదుగురిని కాపాడిన ఆర్మీ

**కరీంనగర్, ఆగస్ట్ 28 :** సిరిసిల్ల జిల్లాలో వరదలో చిక్కుకున్న ఐదుగురిని ఆర్మీ సిబ్బంది రక్షించారు. గంభీరావుపేట మండలం నర్మాల వద్ద ఎగువ మానేరు ప్రాజెక్టుకు అవతలివైపు పశువులను మేపేందుకు బుధవారం ఐదుగురు వ్యక్తులు వెళ్లారు. ఒక్కసారిగా వరద రావడంతో వారంతా అక్కడే చిక్కుకున్నారు. విషయం తెలుసుకున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ తక్షణమే స్పందించారు. కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో మాట్లాడి రెండు హెలికాప్టర్లను తెప్పించారు. ఈక్రమంలో వరదలో చిక్కుకున్న వారిని గురువారం ఆర్మీ అధికారులు రెండు హెలికాప్టర్ల ద్వారా సురక్షిత ప్రాంతానికి తరలించారు. సహాయక చర్యలను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్, ఎస్పీ పరిశీలించారు.




## తెలంగాణలో 36 రైళ్లు రద్దు

**హైదరాబాద్:** తెలంగాణలో భారీ వర్షాల నేపథ్యంలో పలు రైళ్లను దక్షిణ మధ్య రైల్వే రద్దు చేసింది. దీంతో పాటు కొన్ని రైళ్లు దారి మళ్లించినట్లు, మరికొన్నింటిని పాక్షికంగా రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో శ్రీధర్ తెలిపారు. 36 రైళ్లు రద్దు, 25 రైళ్లు దారి మళ్లింపు, 14 రైళ్లను పాక్షిక్షంగా రద్దు చేసినట్లు ఆయన వివరించారు. కామారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. పలుచోట్ల రైలు మార్గంలో వరద నీరు ముం చెత్తింది. దీంతో రైల్వే శాఖ ఈ నిర్ణయం తీసుకుంది. భారీ వర్షాల నేపథ్యంలో రైల్వే ప్రయాణికులకు సహాయం కోసం హెల్ప్‌లైన్ నంబర్లను రైల్వే శాఖ ప్రకటించింది. కాచిగూడ - 90633 18082, నిజామాబాద్ - 97032 96714, కామారెడ్డి - 92810 35664, సికింద్రాబాద్ - 040 277 86170 నంబర్లను సంప్రదించాలని సూచించింది

# ప్రజల కష్టాలపై పట్టింపేది?

- సిరిసిల్ల జిల్లాలో వరద ప్రభావిత ప్రాంతాల్లో కేటీఆర్ పర్యటన
- 'నీరో చక్రవర్తిలా సీఎం ప్రవర్తన" అంటూ ఎద్దేవా
- నష్ట పరిహారాలు ప్రకటించాలని డిమాండ్




**సిరిసిల్ల, ఆగస్టు 28 :** రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు విస్తారంగా కురుస్తున్నా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రజల కష్టాలపై పట్టింపు లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. సిరిసిల్ల జిల్లాలో వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కేటీఆర్ మాట్లాడుతూ, "రోమ్ నగరం తగలబడ్డ సమయంలో నీరో చక్రవర్తి వీణ వాయించాడని చరిత్ర చెబుతుంది. ఇప్పటికీ రాష్ట్రంలో వరదలు ముంచెత్తుతుంటే, సీఎం రేవంత్ మాత్రం మూసీ నది సుందరీకరణ, ఒలింపిక్స్ గురించి సమీక్షలు నిర్వహిస్తున్నారు," అంటూ తీవ్ర విమర్శలు చేశారు. దోమకొండ చెరువు తెగిపోవడం వల్ల కామారెడ్డిలో రాకపోకలు నిలిచిపోయాయని తెలిపారు. గతంలో ఖమ్మం జిల్లాలో వచ్చిన వరదలపై కూడా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించలేదని గుర్తు చేశారు. వరదలో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ. 25 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని, రైతులకు ఎకరాకు రూ.25వేల నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కూలిపోయిన ఇళ్లకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కోరారు. కేటీఆర్ మాట్లాడుతూ, "ప్రభుత్వానికి ముందస్తు ప్రణాళిక లేకపోవడం వల్లే ఇంత నష్టం జరిగింది. ఇప్పటికైనా మేలుకోకపోతే పరిస్థితి మరింత దారుణం అవుతుంది" అన్నారు.

### హెలికాప్టర్లపై విమర్శలు

"కేసీఆర్ హయాంలో మంచిర్యాల, భూపాలపల్లి జిల్లాల్లో వరద బాధితులను రక్షించేందుకు హెలికాప్టర్లు పంపించారు. ఇప్పుడు రాష్ట్రానికి చెందిన హెలికాప్టర్లు బీహార్ ఎన్నికల ప్రచారంలో తిరుగుతున్నాయి. ఖమ్మంలో మంత్రులు ముగ్గురు ఉన్నా, ఒక్క హెలికాప్టరైనా పంపలేకపోయారు," అని మండిపడ్డారు. "ఈ రోజు నిర్మల్ జిల్లాలో చిక్కుకున్న ఐదుగురిని ఎన్డీఆర్ఎఫ్ హెలికాప్టర్ వచ్చి రక్షించిందని చెప్పారు. మరోవైపు ఒకరు వరదలో కొట్టుకుపోయారు. పంటలు నష్టపోయాయి. ఆస్తి నష్టం జరిగింది. ఇది ప్రభుత్వం అప్రమత్తంగా ఉండకుండా పోవడం వల్లే జరిగిందని" విమర్శించారు.

### బీఆర్ఎస్ సహాయ చర్యలు

"ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు వరద బాధితులను ఆదుకునేందుకు సహాయక చర్యలు చేపడుతున్నారు" అని కేటీఆర్ తెలిపారు. ప్రజలకు ఆహారం, వైద్యసహాయం అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. రెవెన్యూ, పోలీసు అధికారులు సహకరిస్తుండడం అభినందనీయం అని చెప్పారు. "రాబోయే నాలుగు రోజులపాటు వర్షాలు విస్తారంగా కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. ఇప్పుడు ముఖ్యంగా చూడాల్సింది - పంట నష్టం ఎంత జరిగింది? ప్రాణ, ఆస్తి నష్టం ఎంత జరిగింది? బాధితులను ఎలా ఆదుకోవాలి?" అని ప్రశ్నించారు.



## మెదక్ జిల్లాలో బీఆర్ఎస్ నేతల పర్యటన

- వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు పరామర్శ
- సీఎం రేవంత్‌పై హరీష్ రావు విమర్శలు

**మెదక్, ఆగస్టు 28 :** రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా కురుస్తున్న వర్షాల వల్ల మెదక్ జిల్లాలో అనేక ప్రాంతాలు నీట మునిగాయి. వరద ప్రభావిత ప్రాంతాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు నేతృత్వంలోని బృందం పర్యటించింది. రాజీపేట గ్రామంలో వరదలో మృతి చెందిన వ్యక్తి సత్యం కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా హరీష్ రావు మీడియాతో మాట్లాడుతూ, "ఒకవైపు ప్రజల ప్రాణాలు పోతున్నాయి. అయితే సీఎం రేవంత్ రెడ్డి మాత్రం మూసీ నది సుందరీకరణ, ఒలింపిక్స్ పోటీల సమీక్షలులిలి చేస్తున్నారంటే దురదృష్టకరం," అని అన్నారు.

### హెలికాప్టర్ల వాడుకపై ఆరోపణలు

"ఒక మంత్రి అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే హెలికాప్టర్లను ఉపయోగించాలని చెబుతుంటే, పెళ్లిళ్లు, బీహార్‌లో ఎన్నికల ప్రచారాలు వంటి వాటికి వాటిని వాడుతున్నారని" హరీష్ రావు ఆరోపించారు. "రాజీపేట గ్రామంలో ఇద్దరు వ్యక్తులు వరద నీటిలో చిక్కుకొని, లిలికరెంట్ పోల్ ఎక్కి నాలుగు నుంచి ఐదు గంటలపాటు సహాయం కోసం ఎదురు చూశారు.లిలి అధికారులకు సమాచారం ఇచ్చినప్పటికీ స్పందించలేదు. మధ్యాహ్నానికి పోల్ కూలిపోయి వారు మృతి చెందారు. హెలికాప్టర్ పంపించి ఉంటే ప్రాణాలు దక్కేవి. ఇది పూర్తిగా ప్రభుత్వ వైఫల్యం' అని ఆరోపించారు. మృతుల కుటుంబాలకు రూ. 25 లక్షల పరిహారం, పంట నష్టానికి ఎకరాకు రూ. 25 వేలు నష్టపరిహారం ఇవ్వాలని హరీష్ రావు డిమాండ్ చేశారు.

### ప్రజల పరిస్థితిపై ఆందోళన

"మెదక్ ముంపు ప్రాంతాల్లో ప్రజలు సహాయక చర్యల కోసం ఎదురుచూస్తున్నారు. తాగునీరు లేక వర్షపు నీటిని తాగుతున్నారు. ధూప్‌సింగ్ తాండా ప్రజలు ప్రభుత్వం సహాయం కోసం ఎదురు చూస్తున్నారు," అని హరీష్ రావు తెలిపారు. ప్రభుత్వం తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని కోరారు. వరద ప్రభావిత గ్రామాల్లో సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి పర్యటించారు. బాధిత గ్రామాలలో తిరుగుతూ ప్రజలను పరామర్శించారు. "మేమున్నాం, మీతో ఉన్నాం" అంటూ భరోసా కల్పించారు. బూరుగుపల్లి గ్రామంలో తెగిపోయిన రోడ్డును పరిశీలించిన హరీష్ రావు, అక్కడి ప్రజలతో మాట్లాడారు. అనంతరం స్థానిక నాయకుల వాహనాలలో రాజీపేటకు బయలుదేరారు.

## వరద ప్రాంతాలను పరిశీలించిన కలెక్టర్



**నిర్మల్, ఆగస్ట్ 28 :** నిర్మల్ జిల్లా లక్ష్మణచందా మండలం మునిపెల్లి గ్రామంలో వాగు ప్రవాహం అవతలి వైపు చిక్కుకుపోయిన పశువుల కాపరిని ఎట్టి పరిస్థితుల్లో తీసుకువస్తామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. గురువారం సంఘటన ప్రదేశాన్ని కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడి వివరాలు సేకరించారు. ఎన్డిఆర్, ఎస్ఎస్డిఆర్ఎఫ్, గ్రామానికి చెందిన గజ ఈతగాళ్లతో మాట్లాడి పశువుల కాపరిని సురక్షితంగా వెనక్కు తీసుకురావడానికి గల సాధ్యాసాధ్యాలను వారితో చర్చించారు. ఎట్టి పరిస్థితుల్లో సురక్షితంగా వెనక్కి తీసుకొస్తామని అన్నారు. పోలీసు సిబ్బంది నిరంతరం వరద ప్రవాహాన్ని పరిశీలిస్తూ ఉండాలని తెలిపారు. ఈ ఘటన ప్రదేశంలో కలెక్టర్ తో పాటు- జిల్లా ఎస్పీ జానకి షర్మిల, అదనపు కలెక్టర్లు పైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, అదనపు ఎస్పి రాజేష్ మీనా, ఆర్డిఓ రత్నకళ్యాణి ఉన్నారు.



## నిండుకుండలా మానేరు జలాశయం

**కరీంనగర్, ఆగస్టు 28 :** ఉమ్మడి కరీంనగర్ జిల్లావ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. మెదక్, కామారెడ్డి జిల్లాల్లో కురుస్తున్న వర్షాలతో మానేరు వాగు ఉగ్రరూపం దాల్చింది. రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. నర్మాల వద్ద ఎగువ మానేరు జలాశయం నిండుకుండను తలపిస్తోంది. దీంతో దిగువకు వరద నీటిని విడుదల చేశారు. మరోవైపు మిడ్ మానేరులోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. మధ్య మానేరు 17 గేట్ల నుంచి 33 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సిరిసిల్ల, కరీంనగర్, ఖమ్మం, సంగారెడ్డి, హనుమకొండ, వరంగల్, పెద్దపల్లి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముంది. ఈ మేరకు వాతావరణశాఖ వెల్లడించింది. సిద్దిపేట, మెదక్, జనగామ జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. అల్పపీడనం ప్రభావంతో నేడు, రేపు తెలంగాణలో భారీవర్షాలు కురిసే అవకాశముంది. నేడు ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే వీలుందని వాతావరణశాఖ తెలిపింది. నేడు ఆదిలాబాద్, కుమురం భీం, మంచిర్యాల, కామారెడ్డి, మెదక్, భూపాలపల్లి, ములుగు, హనుమకొండ, వరంగల్, భద్రాద్రి, మహబూబాబాద్ జిల్లాల్లో భారీ వర్షాలు పడే అవకాశముందని వెల్లడించింది. ఆయా జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది.

## వరదలతో 10 మంది మృతి

**హైదరాబాద్,ఆగస్టు 28 :** ఉత్తర తెలంగాణను భారీ వర్షాలు ముంచెత్తాయి. వరదల కారణంగా ఇప్పటి వరకు 10 మంది చనిపోయినట్లు- సమాచారం ఉందని తెలంగాణ డీజీపీ జితేందర్ తెలిపారు. రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలపై పూర్తి అప్రమత్తంగా ఉన్నట్లు- చెప్పారు. ఇప్పటి వరకు వరదల్లో చిక్కుకున్న దాదాపు 2వేల మందిని రక్షించినట్లు- చెప్పారు. ఇండియన్ ఎయిర్ ఫోర్స్, ఆర్మీ సాయంతో రెండు హెలికాప్టర్ల ద్వారా బాధితులను రక్షించినట్లు డీజీపీ వివరించారు. రెండు వేల మంది సిబ్బందితో ఎస్డీఆర్ఎఫ్ ఏర్పాటు- చేసి రెస్క్యూ ఆపరేషన్ నిర్వహిస్తున్నట్లు- చెప్పారు. ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు వరద ప్రభావిత ప్రాంతాల్లో కలిసి పనిచేస్తున్నాయన్నారు. ఒకవైపు గణేష్ ఉత్సవాలు ఉన్నప్పటికీ.. వరదలపై పోలీసు శాఖ పోరాటం చేస్తోందని తెలిపారు. వరద ప్రాంతాల్లో సహాయక చర్యల కోసం తరలించేందుకు డీజీపీ కార్యాలయంలో కూడా అత్యవసర బృందాలను సిద్ధంగా ఉంచామని డీజీపీ తెలిపారు. హైదరాబాద్‌లో భారీ వర్షాలు వచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

# కేసుల విచారణ.. తీర్పుల్లోనూ గడువు విధించాలి!



మన న్యాయవ్యవస్థ ఇంకా బ్రిటిష్ కాలంనాటి పరిస్థితులకు అనుగుణంగానే సాగుతోంది. న్యాయ వ్యవస్థతో పాటు చట్టాలు, శిక్షల్లో భారతీయీకరణ జరగాల్సి ఉంది. కొత్త చట్టాలు ప్రవేశ పెట్టిన దరిమిలా దీనిపై చర్చ చేయాలి. రాజకీయ నాయకుల నేరాలకు సంబంధించి ఇటీవల పార్లమెంటులో రాజ్యాంగ సవరణ ప్రవేశ పెట్టిన దరిమిలా అనేక అంశాలపై చర్చించాలి. అలాగే గవర్నర్లు, రాష్ట్రపతి బిల్లుల ఆమోదంలో కాల పరిమితి విధించిన సుప్రీం కోర్టు, తన విషయంలోనూ పరిమితి విధించుకోవాలి. ఏళ్ల తరబడి కేసులు నడవడం, తీర్పులు వచ్చే సరికి కొందరు మరణించడం జరుగుతోంది. ఒక్కో కేసు పరిమిత కాలంలో ముగించేలా సంస్కరణలు రావాలి. ఏ కేసయినా ఏడాదికి మించకుండా చూడాలి. సిబిఐ, ఇడి దాడుల కేసుల్లో కూడా సత్వర విచారణ జరగడం లేదు. ఎపికి సంబంధించి వివేకా హత్య కేసు ఆరేదేళ్లుగా ఎటూ తేలలేదు. సిబిఐ విచారణ జరిపినా దోషులు ఎవ్వరన్నది తేల్చలేదు. ఇకపోతే జగన్ ఐదేళ్లు బెయిల్ మీద ఉంటూ పాలన చేశారు. అనేక కేసులు ఇంకా కొలిక్కి రాలేదు. కెసిఆర్ అవినీతిపై విమర్శలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికీ ఎలూ తేల్చలేదు. సత్వరంగా కేసులను విచారించి దోషులకు కేసు పడేలా చేయాలి. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేసులో పరస్పర విరుద్ధ తీర్పులు ఇవ్వడమే గాకుండా 17 ఏళ్లుగా కోర్టులో నానింది. రాజకీయ నాయకుల కేసుల విషయంలో మరీ త్వరగా తీర్పులు రావాలి. ఎందుకంటే పెరుగుతున్న నేరాలు, కొత్తకొత్త మోసాలు, ఐటి మోసాలు, అత్యాచారాలు వంటి వాటిని పరిశీలించి చట్టాల ను మార్పు చేసుకోవాల్సి ఉంది.

హత్యాచారం ఘటనలు మళ్లీ మ్లి జరుగుతూనే ఉన్నాయి. అత్యాచారాలపై ప్రజల్లో భయం లేకుండా పోతున్నది. లిక్కర్ కేసులో సత్వర విచారణ సాగడం లేదు. నేతల అవినీతిపైనా విచారణ సాగడం లేదు. ఇప్పటివరకు పనిచేసిన న్యాయమూర్తులు ఆయా సందర్భాల్లో తమ విలువైన సూచనలు చేశారు. వాటిని సలహాలుగా తీసుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు సాగాలి. ప్రజలకు ఏంచేస్తే సత్వర న్యాయం అందుతుందో ఆలోచించాలి. అవసరమైతే మాజీ ప్రధాన న్యాయమూర్తులు, న్యాయమూర్తుల సలహాలు తీసుకోవాలి. ప్రతిపేదవాడికి న్యాయం అందించడమే న్యాయమూర్తి ప్రధాన లక్ష్యం కావాలి. దేశంలో న్యాయం పట్ల జరుగుతున్న ఆలస్యాన్ని గుర్తించి సత్వర న్యాయం అందేందుకు అసవరమైన చర్యలను చేపట్టాలి. నిర్ణత కాలంలోగా న్యాయ విచారణలు, తీర్పులు వచ్చేలా నట్టబద్దం చేసుకోవాలి. ఇదే సందర్భంలో పెండింగ్ కేసులు సమస్యగా మారాయని కూడా గుర్తించి వాటిని వెంటనే పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకోవాలి. ప్రతి తీర్పులోనూ ప్రజలకు న్యాయం జరిగిందన్న భావన కలగించాలి. రాజకీయ నాయకుల కేసుల విషయంలో త్వరగా విచారణ జరిపి శిక్షలు వేస్తే మంచిది. కోర్టు తీర్పులను అమలు చేయని ప్రభుత్వాలపై కఠిన చర్యలకు అవకాశం ఉండాలి. ఇటీవల పలువురు సుప్రీం చీఫ్ జస్టిస్‌లుగా పనిచేసిన వారు న్యాయవ్యవస్థలో అనేక మార్పులకు శ్రీకారం చుట్టారు. ఇవన్నీ కూడా పేదలకు సత్వర న్యాయం అందాలన్న తపనతో చేసినవే తప్ప మరోటి కాదు. భారత న్యాయ వ్యవస్థ సాధారణ ప్రజలకు ఎంతో దూరంలో నిలిచిందన్న ఆరోపణల్లో వాస్తవాలను గుర్తించాలి. ఇప్పటికీ కోట్ల మంది అణగారిన వర్గాల ప్రజలకు న్యాయ సహాయం అవసరం ఉంది. తమకు అన్యాయం జరిగిందని భావించిన ప్రతి వారూ కోర్టులకు వెళ్లడం లేదు. ఎందుకంటే కోర్టులకు వెళితే తేలేదేమీ లేకపోగా అనవసర కాలయాపన, డబ్బులు దండగ అన్న భావనలో ప్రజలు ఉన్నారు. అవసరమైన వెంటనే న్యాయ వ్యవస్థను ఆశ్రయించడానికి ఇంకా వారు జంకుతూనే ఉన్నారు. న్యాయవ్యవస్థ రాజ్యాంగబద్ధమైన విధులు నిర్వర్తి స్తున్నప్పటికీ నిర్ణీత కాలవ్య వధిలో కోర్టుల్లో కేసులు తేలడంలేదు. తీర్పులు వచ్చాక అమలు కావడం లేదు. అంబేడ్కర్ మహాశయుడి ఆలోచనలకు అందని విధంగా మన రాజకీయాలు మారుతున్నాయి.

సామాన్యులకు న్యాయం అందకుండా పోతోంది. నిరంతరం రాజకీయ కేసులు తప్ప సామాన్యుల పక్షాన న్యాయవ్యవస్థ బలంగా నిలబడడం లేదు. నేటికీ ఎందరో చేయని నేరాలకు జైళ్లలో మగ్గుతున్నారు. ఇలాంటి వారిని ఎలా బయటకు తీసకుని వస్తారన్నది కూడా ముఖ్యం. అలాగే ఎలాంటి కేసునైనా కనీసం 3నెలల్లో ముగించి తీర్పును ఇచ్చేలా కఠిన చట్టాలను అమలు చేయాలి. తెలంగాణలో పలువురు ఎమ్మెల్యేలపై అనర్హత కేసును మూడు నెలల్లో తేల్చాలని సుప్రీం ఆదేశించింది. నిజానికి ఎన్నికలయిన ఓ నెలరోజుల్లోగా ఎన్నికైన ప్రజాప్రతినిధులపై ఏవైనా కేసులు ఉంటే తేల్చేయాలి. ఏళ్లతరబడి కేసునలు నాన్చేయడం వల్ల ఐదేళ్ల పుణ్యకాలం గడిచిపోతోంది. చిట్టచివరకు ఎన్నికల ముందు తీర్పులు వ్యతిరేకంగా వచ్చినా చేయగలిగేది ఏమీ లేదు. కనుక వీటిపైనా దృష్టి సారించాల్సి ఉంది. న్యాయవ్యవస్థలో సమూల మార్పులు జరగాలని గుర్తు చేసుకోవాలి. ప్రధానంగా స్థానిక భాషల్లో కోర్టు కార్యకలాలపాలు సాగాలి. కోర్టుల్లో న్యాయ చర్చలను స్థానిక భాషల్లో చర్చించేలా చట్టం చేసుకోవాలి. గతంలో ప్రధాని మోడీ కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు. కాబట్టి ఇప్పుడీ విషయంపై చర్చించాల్సిన అవసరం ఉంది. ప్రజలకు అర్థంకాని భాషలో కాకుండా ప్రజలకు అర్థం అయ్యే భాషలో న్యాయచర్చలు సాగాలి. కోర్టుతీర్పులు స్థానిక భాషల్లో విడుదల చేయాలి. పాలకులు పేదలకు న్యాయన్ని చేరువ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలి. అనేక సంస్కరణలు తీసుకుని వచ్చామని చెబుతున్న ప్రధాని మోడీ ఈ న్యాయవ్యవస్థలో ఉన్న లోటుపాట్లను గుర్తించి తక్షణ చర్యలకు పూనుకోవాలి. పార్లమెంట్ వేదికగా దీనికి శాశ్వత పరిష్కారం చూపాలి. వివేకానందరెడ్డి హ్యాతకేసు, కోడికత్తి కేసులు తీసుకుంటే ఎంతలా జాప్యం జరుగుతుందో చూడవచ్చు. పోలీసుల విచారణలో జాప్యం.. కోర్టుల్లో జాప్యం వంటివన్నీ పోవాలి. కేసు తీవ్రతను బట్టి సత్వర విచారణ, తీర్పులు రావాలి. ఇందుకు అవసరమైతే.. మనదేశం వేల ఏళ్లుగా అనుసరించిన రాజ్యాంగ వ్యవస్థలను, న్యాయవ్యవస్థలను, ఇతర దేశాల్లో అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేయాలి. నిజానికి కోర్టులు, రాజ్యాంగం పట్ల ప్రజలకు సరైన అవగాహన లేదు. ప్రజలను కోర్టులకు చేరువ చేయడం రాజ్యాంగ విధి కావాలి. రాజ్యాం గం అంటే పాలకులకు సంబంధించిన వ్యవహారంగా ఉండరాదు. న్యాయ వ్యవస్థపై అవగా హన కల్పించేందుకు, విశ్వాసం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలి. ప్రజలకు న్యాయ వ్యవస్థ పట్ల విశ్వాసం కలిగించాలి. లోకల్ కోర్టులను పెంచి సత్వర న్యాయం కలిగించాలి. మన న్యాయవ్యవస్థ, ప్రొసీడింగ్స్ ఇంకా ఆంగ్లేయులనాటి విధానాలనే అవలంబిస్తోందన్న ఆరోపణల నుంచి బయటపడి పటిష్టమైన న్యాయ చట్టాలను రూపొందిం చాలి. దీనిని ప్రాతిపదికగా తీసుకుని మన పాలకులు న్యాయవ్యవస్థలో సంస్కరణలకు శ్రీకారం చుట్టాలి. సత్వర న్యాం అందడం కోసం అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలి. ఎలాంటి కేసయినా ఓ యేడాదిలోగా ముగిస్తే మంచిదన్న భావనలో విచారణలు సాగాలి.

# అల్పపీడనంతో అతలాకుతలం

- కామారెడ్డి, మెదక్ జిల్లాల్లో తీరని నష్టం
- రోడ్లు, కల్వర్టులకు గండ్లు - రాకపోకలకు అంతరాయం
- నీటమునిగిన దాదాపు అన్ని పంటలు
- ఊళ్ళన్నీ చెరువుల్లా మారడంతో ప్రజల అవస్థలు
- డ్రోన్ల ద్వారా ఆహార పొట్లాల పంపిణీ
- ముమ్మరంగా సహాయక చర్యలు



**నిజామాబాద్, ఆగస్టు 28 :** అల్పపీడనం వలన తెలంగాణ రాష్ట్రంలోని పలుచోట్ల తీవ్ర పరిణామాలు చోటుచేసుకున్నాయి. కామారెడ్డి, మెదక్, నిర్మల్ జిల్లాల్లో మంగళవారం రాత్రి నుంచి బుధవారం రాత్రి వరకు కుంభవృష్టి కురవడంతో భారీ నష్టం సంభవించింది. చెరువులు, కాలువలు పొంగిపొర్లాయి. కల్వర్టులు, రోడ్లు పాడయ్యాయి. ముఖ్యంగా కామారెడ్డి, మెదక్ జిల్లాల్లో జనజీవనం అస్తవ్యస్తమైంది. తెలంగాణలోని పలు ప్రాంతాల్లో అతి భారీ వర్షాలు కురవడంతో, కామారెడ్డి, మెదక్ జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశారు. కామారెడ్డి జిల్లాలో వర్షాలు బీభత్సాన్ని సృష్టించాయి. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. పంట పొలాలు, నివాస ప్రాంతాలు చెరువులుగా మారాయి. దాదాపు అన్ని పంటలు నష్టపోయాయి.

## ప్రభావిత ప్రాంతాల్లో రాకపోకలకు అంతరాయం

కామారెడ్డి–భిక్కనూర్ మార్గంలో రైలు పట్టాల కింద వరద నీరు ప్రవహించడంతో భారీ గండిపడింది. దీంతో రైళ్ల రాకపోకలను అధికారులు నిలిపివేశారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో వాగు పొంగడంతో కార్లు వరద ప్రవాహంలో కొట్టుకుపోయాయి. హౌసింగ్ బోర్డు కాలనీలో ఇళ్లలోకి నీరు ప్రవేశించడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

## విద్యాసంస్థలకు సెలవులు - పరీక్షలు వాయిదా

కామారెడ్డి, మెదక్ జిల్లాల్లో వర్షాల ప్రభావంతో గురువారం ప్రభుత్వ మరియు ప్రైవేటు విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించారు. వాతావరణ శాఖ ప్రకారం మెదక్, నిర్మల్ జిల్లాల్లో ఇంకా వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆయా ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహించనున్నారు. ఇక తెలంగాణ యూనివర్శిటీ పరిధిలోని పరీక్షలు వాయిదా పడ్డాయి. శుక్రవారం పరీక్షలు యథాతథంగా జరుగుతాయని వీసీ యాదగిరి రావు తెలిపారు. బుధవారం రాత్రి వరద నీరు అధికంగా రావడంతో పోచారం ప్రాజెక్టులో కట్టకు కొంత భాగం కోతకు గురైంది. నీటిపారుదల శాఖ డీఈ వెంకటేశ్వర్లు ప్రకారం, ప్రాజెక్టుకి ప్రమాదం ఏమీ లేదని, కోతకు గురైన ప్రాంతంలో ఇసుక బస్తాలు వేయించనున్నట్టు తెలిపారు.



### వర్షపాతం వివరాలు (సెం.మీ.లో)

- రాజంపేట (కామారెడ్డి): 43.1
- అక్కాపూర్ (నిర్మల్): 32.3
- సర్దా (మెదక్): 30.2
- కామారెడ్డి పట్టణం: 28.9
- భిక్కనూర్ (కామారెడ్డి): 27.9
- వడ్యాల్ (నిర్మల్): 27.9
- తాడ్వాయి (కామారెడ్డి): 27.5
- నాగాపూర్ (మెదక్): 26.6
- పాత రాజంపేట (కామారెడ్డి): 24.6
- లింగంపేట (కామారెడ్డి): 22.5
- దోమకొండ: 20.2
- విశ్వనాథ్‌పేట (నిర్మల్): 24.1
- ముజిగి: 23.1
- చేగుంట (మెదక్): 20.2


## మరణించినవారి వివరాలు

దోమకొండ మండలంలోని సంగమేశ్వర్ ఎడ్లకట్ట వాగు సమిపంలో కారుతో సహా తండ్రి–కొడుకులు కొట్టుకుపోయారు. స్థానిక ఆర్ఎంపీ డాక్టర్ మేక చిన్న హరిశంకర్ మరియు ఆయన కుమారుడు మహేశ్ తమ మేనల్లుడి అంత్యక్రియలకు వెళుతుండగా వాగు ఉధృతి కారణంగా వాహనం చిక్కుకుంది. వారు కారుపై కూర్చొని సహాయం కోరగా, గ్రామస్థులు జేసీబీ సహాయంతో రక్షించేందుకు ప్రయత్నించారు. కానీ వారికి 9 గంటలపాటు తీవ్రంగా నరకయాతన అనుభవించాల్సి వచ్చింది. చివరకు నీటి ప్రవాహం తగ్గిన తర్వాత సురక్షితంగా బయటపడగలిగారు. రాజంపేట మండల కేంద్రంలో గోడకూలిన ఘటనలో యువ వైద్యుడు వినయ్ (28) మృతి చెందారు. దేవుని చెరువు కట్ట తెగిపోవడంతో, ఆయన ఇంట్లోకి నీరు వచ్చి, ఆ నీటిని బయటకు మళ్లించేందుకు గోడకు రంధ్రం చేస్తుండగా, గోడ కూలి ఆయనపై పడి మృతి చెందారు. రాజంపేట మండలంలోని 3 తండాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. బీబీపేట మండలంలో 9 మంది యువకులు చెరువు కట్టపై ఇరుక్కుపోయారు. తిమ్మారెడ్డిలో కల్యాణి వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. వాగుపై బ్రిడ్జి నిర్మాణం జరుగుతున్న చోట ఆరుగురు కార్మికులు వరదలో చిక్కుకున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో వర్షాలు ఉరుములతో కూడి కురవడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. హవేలిఘనపూర్ మండలంలోని రాజపేటతండాలో వాగులో చిక్కుకున్న 10 మందిని రక్షించేందుకు లెఫ్టినెంట్ కల్నల్ నిఖిల్ నేతృత్వంలోని ఆర్మీ బృందం రంగంలోకి దిగింది. 30 మంది జవానులు అక్కడకు చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు.



# రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా వినాయకచవితి


## ప్రత్యేక పూజల్లో పాల్గొన్న రేవంత్ దంపతులు



**హైదరాబాద్, ఆగస్టు 28 :** వినాయక చవితి పర్వదినం రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. వర్షాల కారణంగా మంటపాలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అయినా ప్రజలు ఉత్సాహంగా పూజల్లో పాల్గొన్నారు. ఎక్కడ చూసినా సందడి కనిపించింది. ఈ సందర్భంగా... జూబ్లీహిల్స్ నివాసంలో కుటుంబ సమేతంగా గణపతి పూజ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు చేశారు. వినాయక చవితి సందర్భంగా సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్ రావు పూజలు నిర్వహించారు.. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ, విఘ్నేశ్వరుని ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలు పాడి పంటలతో సుభిక్షంగా ఉండేలా చూడాలని ప్రార్థించనన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించేందుకు అందరూ మట్టి గణపతులను పూజించాలని సూచించారు. క్ష తో తరుచేసిన విగ్రహాల వలన చెరువులు, జల వనరులు కలుషితం అవుతాయని, వాటిని కాపాడేందుకు మట్టి వినాయకులను నిమజ్జనం చేయాలి అని ఆయన సూచించారు. పది రోజుల పాటు– జరిగే ఈ ఉత్సవాలలో అందరు భక్తి శ్రద్ధలతో పాల్గోని ఘణంగా జరుపుకోవలని ఆయన కోరారు.

# భారీ వర్షాలపై అప్రమత్తమైన ప్రభుత్వం

- ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు : మంత్రి మండలి
- మెదక్, కామారెడ్డి, నిర్మల్, సిరిసిల్ల జిల్లాల్లో వరదలపై కట్టుదిట్టు నిఘా
- అధికారులతో మంత్రుల వీడియో కాన్ఫరెన్స్



**హైదరాబాద్, ఆగస్టు 28:** రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరగకుండా అన్ని చర్యలు చేపడుతున్నట్టు మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిల్ల శ్రీధర్ బాబు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అవసరమైన ఆదేశాలు జారీ చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు నేతృత్వంలో కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ జరిగింది. అందులో పాల్గొన్న రెవెన్యూ మంత్రి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, మెదక్, కామారెడ్డి, నిర్మల్, సిరిసిల్ల జిల్లాల్లో అదనంగా ఎన్‌డిఆర్ఎఫ్ బృందాలు పంపించాలని ఆదేశించినట్టు చెప్పారు. ఇప్పటికే కలెక్టర్ల వద్ద విపత్తుల నిర్వహణ నిధులు అందుబాటులో ఉన్నాయని, అవసరమైతే మరిన్ని నిధులు కూడా కేటాయిస్తామని తెలిపారు. పోచారం ప్రాజెక్టులో నీటి మట్టం పెరగడంతో కాలువకు గండి వేసి నీటిని విడుదల చేసి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. చెరువులు, వాగులు పొంగి ప్రవహిస్తున్న ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేసి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. ఇంజనీర్లు, ఉన్నతాధికారులు ప్రాజెక్టుల వద్దే ఉండి పరిస్థితిని పర్యవేక్షించాల న్నారు. అవసరమైతే హెలికాప్టర్ల ద్వారా సహాయక చర్యలు చేపట్టేందుకు సన్నద్ధంగా ఉన్నామని తెలిపారు. ముంపు ప్రాంతాల్లోని ప్రజలకు ఆహారం, మంచినీరు, ఇతర అవసరాలను కల్పించేందుకు పోలీస్ శాఖ ద్వారా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు మాట్లాడుతూ, సహాయక చర్యల కోసం సీనియర్ ఐఏఎస్ అధికారులను ప్రత్యేక బాధ్యతలతో నియమిస్తున్నట్టు తెలిపారు. సచివాలయంలో 24 గంటల కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. ప్రజలకు నష్టం లేకుండా ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటోందన్న నమ్మకాన్ని కల్పించాలని జిల్లా కలెక్టర్లు, ఎస్పీలను సీఎం సూచించారు. నిర్మల్, కామారెడ్డి జిల్లాల్లో ఇప్పటికే లిలిఎన్‌డిఆర్ఎఫ్ బృందాలు పనిచేస్తున్నాయని, అవసరమైతే లిలిఎస్‌డిఆర్ఎఫ్ బలగాలను కూడా పంపిస్తున్నామని సీఎస్ తెలిపారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో విపత్తుల నిర్వహణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్, నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జ, పోలీస్ అడిషనల్ డీజీ మహేష్ భగవత్, ఫైర్ సర్వీసుల డీజీ నాగిరెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

# హైదరాబాద్, ఆదిలాబాద్ మధ్య రాకపోకలకు అంతరాయం

**నిర్మల్, ఆగస్ట్ 28 :** తెలంగాణలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో, ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న వాహనదారుల కోసం నిర్మల్ జిల్లా పోలీసులు ప్రత్యేక సూచనలు చేశారు. కొన్ని ప్రాంతాల్లో భారీ వరద నీటి కారణంగా రహదారుల ఘోరంగా దెబ్బతినడంతో వాహనదారులు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. నిర్మల్ సమీపంలోని కొండాపూర్ బ్రిడ్జి వరకు వచ్చిన తర్వాత అక్కడ నుంచి వాహనదారులు గమ్యం చేరుకునేందుకు ఏ వైపుగా ప్రయాణించాలో రూట్ మ్యాప్ విడుదల చేశారు. ఆదిలాబాద్ నుంచి వాహనదారులు కొండాపూర్ బ్రిడ్జి చేరుకున్న తర్వాత అక్కడ నుంచి ఎడమవైపుకు మళ్లి డైవర్షన్ మార్గాన్ని ఎంచుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఈ మార్గంలో వాహనదారులు మామడ, ఖానాపూ–ర్‌మెట్, జగిత్యాల, కరీంనగర్ మీదుగా హైదరాబాద్‌కు చేరుకోవచ్చని జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల తెలిపారు. ఈ రూట్ ఛేంజ్ గురించి ఎస్పీ అధికారిక ప్రకటనను విడుదల చేశారు. కాబట్టి, ప్రయాణికులు ముందస్తుగా మార్గ సమాచారం తెలుసుకుని ప్రయాణించాలని భద్రతాపరంగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే హైదరాబాద్ నుంచి కఐ 44 (నాగ్‌పూర్ హైవే) మీదుగాఆదిలాబాద్ వెళ్లే వాహనదారుల భద్రత కోసం సైబరాబాద్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఓ ముఖ్యమైన ప్రకటన విడుదల చేసింది.

# వరద ముంచెత్తడంతో గ్రామాలు ఖాళీ

## సురక్షిత ప్రాంతాలకు తరలిన ప్రజలు

**కామారెడ్డి, ఆగస్ట్ 28 :** భారీ వర్షాల కారణంగా కామారెడ్డి జిల్లాలోని పలు గ్రామాలను వరద ముంచెత్తుతోంది. ఈక్రమంలో డోంగ్లి మండలంలోని సిర్పూర్, హాసన్ టాక్లి, పెద్దటాక్లి గ్రామాల్లోని ప్రజలు ఇళ్లు ఖాళీ చేసి ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారు. పొరుగు గ్రామాల్లోని తమ బంధువుల ఇళ్లలో తలదాచుకుంటున్నారు. చిన్నారులు, వృద్ధులు మద్నూర్ మండలంలోని మిర్జాపూర్ (సలాబత్ పూర్) ఆంజనేయస్వామి ఆలయంలో తలదాచుకున్నారు. పెద్ద టాక్లీలోని కొన్ని కుటు–ంబాలు డోంగ్లి మండల కేంద్రానికి వెళ్లాయి. సిర్పూర్‌లో 246, పెద్దటాక్లిలో 190, హాసన్ టాక్లిలో 120 కుటు–ంబాల వారు తమ ఇళ్లకు తాళాలు వేశారు. పిట్లం మండలం కుర్తి గ్రామం పూర్తిగా జల దిగ్బంధంలో చిక్కుకుంది. నియోజక వర్గంలోని నిజాంసాగర్, కౌలాస్ నాలా జలాశయాల గేట్లు– ఎత్తి వరద నీటిని దిగువ మంజీరాలోకి విడుదల చేస్తున్నారు. దీంతో ముంపు గ్రామాల ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు బాధితులకు పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు– చేయాలని అధికారులను కోరారు.

## జిల్లా వ్యాప్తంగా 2850 వినాయక విగ్రహాలు ఏర్పాటు

### జిల్లా ఎస్పీ కే నరసింహ ఐపిఎస్



**సూర్యాపేట, రాజముద్ర న్యూస్:** జిల్లా వ్యాప్తంగా గణేష్ విగ్రహాల ఏర్పాటుకు పోలీస్ ఆన్లైన్ నందు 2850 ధరకాస్తు వచ్చాయి అని ఎస్పి నరసింహ ఐపిఎస్ తెలిపినారు. అన్ని ఆన్లైన్ చేయబడి, పరిశీలన చేసి అనుమతి ఇవ్వడం జరిగినది అన్నారు. డిజిటల్ జియో ట్యాగింగ్ చేసి పోలీసులు పర్యవేక్షణ చేస్తున్నాం అన్నారు. ప్రజలు, ఉత్సవ కమిటీలు జాగ్రత్తలు పాటించాలి. సంతోషంగా ఉత్సవం జరుపుకోవాలి. వర్షం వస్తున్నందున విద్యుత్ తీగలతో అప్రమత్తంగా ఉండాలన్నారు పరిశుభ్రతను పాటించాలన్నారు ఇతరుల మనోబావాలు గౌరవించాలన్నారు, నిర్ణీత సమయంలో భక్తి పాటలు ప్రసారం చేయాలని పేర్కొన్నారు రూమర్స్ ను నమ్మవద్దు అని కోరారు. భక్తులకు, వచ్చే పోయే వాహనదారులకు ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు పాటించాలని తెలిపారు మండపాల వద్ద బెట్టింగ్, ల్యాటరి లు నిర్వహించవద్దు అని కోరారు. గణేష్ మండపాల ఏర్పాటు, నవరాత్రి ఉత్సవాల నిర్వహణ సందర్భంగా జిల్లా కేంద్రంలో పలు చోట్ల గణేష్ మండపాల వద జిల్లా డాగ్ స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్ సిబ్బంది భద్రత పరిశీలించారు. ప్రజలకు మెరుగైన రక్షణ కల్పించడంలో భాగంగా జిల్లా ఎస్పి నరసింహ ఆదేశాల మేరకు ఈ తనిఖీలు నిర్వహించడం జరిగిందన్నారు.

## యూరియా దుర్వినియోగం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి

### వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** యూరియా దుర్వినియోగం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్ అన్నారు. గురువారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో వికారాబాద్ జిల్లాలో యూరియా లభ్యత, నానో యూరియా వాడకం, చెక్ పోస్ట్ ల ఏర్పాటు తదితర అంశాలపై వ్యవసాయ అధికారులతో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... యూరియా బ్లాక్ మార్కెట్ కాకుండా జాగ్రత్త తీసుకోవాలని, యూరియా లభ్యతపై రైతులు ఎలాంటి ఆందోళన చెందకూడదనే భరోసా ఇవ్వాలన్నారు. రైతులకు యూరియా లభ్యతకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు 20124 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేయడం జరిగిందని, వారం రోజుల్లోగా జిల్లాకు అదనంగా 640 మెట్రిక్ టన్నుల యూరియా రావాల్సి ఉందని ఆయన తెలిపారు. మండల సొసైటీల్లో 184 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని అదేవిధంగా ప్రైవేటు డీలర్ల వద్ద 596 బట్టి టన్నుల యూరియా అందుబాటులో ఉందని కలెక్టర్ తెలిపారు. మార్క్ ఫెడ్ సొసైటీ లకు 100 మెట్రిక్ కన్నుల యూరియాను తరలిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. మండల వ్యవసాయ అధికారులు, విస్తరణ అధికారులు యూరియా విక్రయ కేంద్రాల వద్ద ఉంటూ క్షుణ్ణంగా పరిశీలిస్తూ రైతులకు యూరియా అందే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. జిల్లా నుండి యూరియా అక్రమంగా ఇతర ప్రాంతాలకు తరలించకుండా ఉండేందుకు సరిహద్దు ప్రాంతాల్లో చెక్ పోస్టులను నిర్వహించి తగు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు పోలీస్, రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి యూరియా ఇతర ప్రాంతాలకు తరలకుండ అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. నానో యూరియా పై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. నానో యూరియా వాడకంపై రైతులకు తెలియజేస్తూ వారిని ప్రోత్సహించాలని ఆయన అధికారులకు సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ సుధీర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రాజారత్నం, ఏడిఏ సందీప్ కుమార్, ఏడిలు సౌభాగ్య లక్ష్మి, శంకర్ నాయక్, వెంకటేశం, తదితరులు పాల్గొన్నారు.



## గ్రంథాలయాలకు సెస్‌లను చెల్లించాలి

### సూర్యాపేట జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు

**సూర్యాపేట, రాజముద్ర న్యూస్ :** సూర్యాపేట జిల్లాలోని మున్సిపాలిటీలు గ్రంథాలయాలకు చెల్లించవలసిన గ్రంథాలయ సెస్ ను చెల్లించాలని జిల్లా అదనపు కలెక్టర్ మరియు సూర్యాపేట మున్సిపాలిటీ ప్రత్యేక అధికారి రాంబాబు అన్నారు. గురువారం నాడు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సూర్యాపేట జిల్లాలోని మునిసిపల్ కమిషనర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు మాట్లాడుతూ జిల్లా లో గ్రంథాలయాలకు రెండు కోట్ల వరకు మున్సిపల్ సెస్ రావలసి వుందని, కాబట్టి మున్సిపాలిటీ లు చెల్లించవలసిన 8% సెస్ ను త్వరగా చెల్లించి గ్రంథాలయాల అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట మున్సిపల్ కమిషనర్ హనుమంత రెడ్డి, తిరుమలగిరి మున్సిపల్ కమిషనర్ మున్వర్ ఆలి, నేరేడుచర్ల మున్సిపల్ కమిషనర్ అశోక్ రెడ్డి, కోదాడ మున్సిపల్ కమిషనర్ రమాదేవి, హుజూర్‌నగర్ మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి ఇంకా గ్రంథాలయ కార్యదర్శి బాలమ్మ శ్యాంసుందర్ రెడ్డి, శ్రవణ్ కుమార్, రంగారావు తదితరులు పాల్గొన్నారు.



## ముల్కనూర్‌లో ఎలక్ట్రిక్ బైక్ షోరూం ప్రారంభం

**భీమదేవరపల్లి, రాజముద్ర న్యూస్:** భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో ఇటుగో కంపెనీకి సంబంధించిన ఎకోస్పియర్ సొల్యూషన్స్ ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాల షోరూంను గురువారం ప్రారంభించారు. ఈ ఎలక్ట్రిక్ బైకులు గ్రామీణ ప్రాంత ప్రజలతోపాటు, విద్యార్థులకు, రైతులకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. తక్కువ దూరం ప్రయాణించే వారికి ఈ ఎలక్ట్రిక్ బైకులు అనువుగా ఉంటాయని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. ఈ బైకులను ఒకసారి చార్జ్ చేస్తే గరిష్టంగా 120 కిలోమీటర్ల వరకు మైలేజ్ వస్తుందని నిర్వాహకులు తెలిపారు. ఈ ఎలక్ట్రిక్ బైకులు కచ్చితంగా వినియోగదారులను ఆకర్షిస్తాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఊసకోయిల ప్రకాష్, అన్నవరపు కిరణ్, ఉడుత విటోబా, దొంగల కొమురయ్య, బొజ్జపూరి మురళి, దొంతరబోయిన వెంకటేశ్వర్లు, మధుకర్ శర్మ, కాసగోని భాస్కర్, రణధీర్ రెడ్డి, వన రాజు, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎరువుల కొరతను తీర్చకుంటే సచివాలయాన్ని ముట్టడిస్తాం

### మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** గురువారం వికారాబాద్ పట్టణంలోని పిఎసిఎస్ కార్యాలయం దగ్గర ఉదయం 6 గంటల నుండి వానలో తడుస్తూ బారులు తీరిన రైతులను వికారాబాద్ జిల్లా బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ పరామర్శించారు. యూరియా కోసం లైన్లో వేచి ఉన్న రైతులతో మాట్లాడి వారు పడుతున్న ఇబ్బందులు తెలుసుకున్నారు. ప్రభుత్వం రైతుల పట్ల చూపిస్తున్న నిర్లక్ష్యానికి గాను రైతులతో పాటు క్యూ లైన్ లో నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసిన పాపానికి రైతులకు పండుగలు లేవు పైగా కుటుంబాన్ని, పొలం పనులను వదిలేసి ఉదయం 6 గంటల నుండి సాయంత్రం వరకు యూరియా కోసం లైన్లో వేచి చూడాల్సిన పరిస్థితి వచ్చిందన్నరు. తిండి తిప్పలు మాని ఎంతో ఇబ్బంది పడుతూ లైన్లో వేచి ఉన్న సరే ఎరువులు దొరుకుతాయని నమ్మకం లేదన్నరు. రాష్ట్రంలో వ్యవసాయ శాఖ మంత్రి మాట్లాడుతూ కేంద్రం నుండి అందాల్సిన వాటా అందకపోవడం వల్లే యూరియా కొరత వస్తుందని చెప్తున్నారు, మరోవైపు ముఖ్యమంత్రి రాష్ట్రంలో అసలు యూరియా కొరతే లేదని చెప్తున్నారు. ఎవరిది నిజం..? ఎవరిది అబద్ధం..?మని అన్నారు. కెసిఆర్ పాలనలో గత పది సంవత్సరాలలో ఎప్పుడైనా ఈ పరిస్థితి చూసామా..? ఇది కృత్రిమ ఎరువుల కొరత అని కాంగ్రెస్ పార్టీ నాయకులె చెప్తున్నారు. ఈ కృత్రిమ కొరత సృష్టిస్తున్నది ఎవరు..? వారిని గుర్తించారా..? లేక ఇప్పటికి గుర్తించలేకపోయారా..?, ఒకవేళ గుర్తిస్తే ఎందుకని వారికి చట్టపరంగా శిక్ష విధించడం లేదని ప్రశ్నించారు. తప్పు ఎక్కడ జరుగుతుంది, సీఎం జిల్లా, స్పీకర్ నియోజకవర్గం వికారాబాద్ జిల్లా కేంద్రంలో పరిస్థితి ఈ విధంగా ఉండడం సిగ్గుచేటన్నరు. సీఎం, స్పీకర్ దీనిపై సమీక్ష నిర్వహించి రైతులకు సకాలంలో అవసరమైన ఎరువులను అందేలా చూడలని అన్నారు. రాష్ట్రంలో ఎక్కడ సమావేశం నిర్వహించిన లేదా మీడియా సమావేశం నిర్వహించిన బి ఆర్ ఎస్ పార్టీని, కెసిఆర్, కేటీఆర్ మీద మీ విమర్శలు మాని రైతులకు సరిపడా ఎరువులు సకాలంలో అందించడం పైన దృష్టి పెట్టలని పేర్కొన్నారు. పట్టా పాస్ బుక్కులు లేని రైతులకు యూరియా అందించడం కుదరదని చెప్తున్న మీరే.. రెండు లక్షల రుణమాఫీ చేస్తామని చేయకుండా వదిలేశారు. రైతుల పాస్ బుక్కులు బ్యాంకులలో ఉండిపోయాయని మరిచారా ఇప్పుడు వాటిని తీసుకురమ్మంటే ఎక్కడ నుండి తీసుకొస్తారని ప్రశ్నించారు. రైతుబంధు ఊసే లేదు రుణమాఫీ పూర్తిస్థాయిలో జరగలేదు, సబ్సిడీ పైన అందిస్తామన్న యంత్రాల జాడలేదని అన్నారు. రైతులకు ఉచితంగా ఎరువులు అందిస్తామన్నారు. ఉచితంగా అందించడం ఎలాగూ లేదు కనీసం డబ్బులు ఇస్తామన్నా సరే ఇచ్చే దిక్కులేదన్నరు. రాష్ట్రంలో రైతులు యూరియా కోసం వెళ్తే లాఠీ చార్జి చేయడం అమానుషం. జనహిత అని పేరు పెట్టుకుని రాత్రుల్లో పాదయాత్రలు చేయడం కాదు మీకు చేతనైతే ఇలాంటి ప్రదేశాల్లోకి వచ్చి రైతుల సమస్యలు అడిగి చూడండని అన్నారు. సకాలంలో ఎరువులు అందించకుండా ఆలస్యంగా అందిస్తే దానివల్ల ఏం ఉపయోగం ఉండదు, రైతులు సర్వం నష్టపోతారు. యూరియా కొరత ఇలాగే కొనసాగితే జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని, అవసరమైతే రాష్ట్ర సచివాలయాన్ని ముట్టడిస్తామని బి ఆర్ ఎస్ పార్టీ తరుపున ప్రధాన ప్రతిపక్షంగా, వికారాబాద్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులుగా హెచ్చరించారు.



## సివిల్ ఆసుపత్రి సూపర్నెంట్ ఆనంద్‌కు మెమో జాయిన్ చేసిన కలెక్టర్

**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** విధుల పట్ల నిర్లక్ష్యం వహించినందున వికారాబాద్ జిల్లా సివిల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్ కు మెమో జారీ చేయడం జరిగిందని వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. గురువారం వికారాబాద్ జిల్లా కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో పని చేస్తున్న 9 మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను కలెక్టర్ అనుమతి లేకుండా, ఎలాంటి పర్మిషన్ తీసుకోకుండా బదిలీ చేయడం జరిగిందని, సిబ్బంది అందుబాటులో లేనందున పరిపాలన పనులకు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో ఆటంకం ఏర్పడినందున మెమో జారీ చేయడం జరిగిందని, అట్టి మెమో కు ఒక్క రోజులో నివేదిక ఇవ్వాలని తెలిపారు.

## ఫర్టిలైజర్ షాపుల తనిఖీ

**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** యూరియా కొరకు రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకూడదని గురువారం వికారాబాద్ పట్టణ కేంద్రంలోని పిఎసిఎస్, కిసాన్ ఆగ్రోస్, రైతు ఆగ్రోస్, గుల్షన్ ఫర్టిలైజర్స్, శ్రీలక్ష్మి నారాయణ ఏజెన్సీ వీటిని విజిలెన్స్, ఎన్ ఫోర్స్ మెంట్ బృందాలతో పాటు వికారాబాద్ మండల వ్యవసాయ అధికారి ప్రసన్నలక్ష్మి తనిఖీలు నిర్వహించారు. రైతులకు యూరియా వలన ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఫర్టిలైజర్స్ యాజమాన్యాలకు సూచించారు. రైతులు క్యూ లైన్ లో నిలబడకుండా వచ్చిన వారికి వచ్చినట్లు యూరియా ఇవ్వాలని, రైతులను ఇబ్బందులు పెట్టే పరిస్థితులు రాకుండా చూసుకోవాలని సూచించడం జరిగిందని వ్యవసాయ అధికారి ప్రసన్నలక్ష్మి తెలిపారు.

## ఏటీసీలో అత్యధికంగా యువతకు ప్రవేశాలు చేపట్టాలి

### జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి ఏటీసీలలో కోర్సులు ప్రారంభమవుతున్న క్రమంలో గురువారం కలెక్టర్ ఛాంబర్‌లో ఏటీసీలు తెలంగాణ యువతకు అత్యాధునిక నైపుణ్య శిక్షణ సంస్థలు, ఏటిసి అంటే ఏమిటి? అనే గోడ ప్రతులను జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అధికారులను ద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ... యువత ఉపాధి అవకాశాల కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేయడం జరిగింది అన్నారు. తాండూర్, వికారాబాద్, మోమిపేట్ లలో అత్యధిక నైపుణ్యతతో కూడిన శిక్షణలో ఇవ్వడం జరుగుతుందని ఇందుకు ఉద్యోగం చేయాల న్న ఆసక్తి, ఆర్థికంగా అత్యంత స్థాయికి చేరుకోవాలని కలలు కంటున్న యువతకు ఏటీసీలు ఎంతగానో దోహదపడతాయని కలెక్టర్ తెలిపారు. అత్యాధునిక మిషనరీ లతో ప్రాక్టికల్ శిక్షణ ఇవ్వబడుతుందని ఆయన తెలిపారు. ఆగస్టు 30 వరకు ఏటీసీలో ప్రవేశాలకు అవకాశముందని ఇలాంటి మంచి సదవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. గోడ ప్రతి ఆవిష్కరణలో టి-గెట్ వైస్ చైర్మన్ సరిత, ఐటిఐ ప్రిన్సిపాల్ నాగేంద్రబాబు, జిల్లా ఉపాధి శిక్షణ అధికారి ఎస్.ఏ. సుభాన్, ట్రైనింగ్ ఆఫీసర్ సరోష్ తదితరులు ఉన్నారు.

## అర్హులైన పేద ప్రజలందరికీ ఇందిరమ్మ ఇండ్లు

### మాజీ మేయర్ అమర్ సింగ్

- మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ త్రిలేశ్వరరావు ఆధ్వర్యంలో ఇండ్ల పట్టాల మంజూరు పత్రాల పంపిణీ
- పాల్గొన్న పలువురు మాజీ కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, లబ్ధిదారులు



**పీర్జాదిగూడ, రాజముద్ర న్యూస్:** రాష్ట్రంలో అర్హులైన నిరుపేద ప్రజలందరికీ సొంతింటి కల నెరవేరుతుందని పీర్జాదిగూడ నగర మాజీ మేయర్ అమర్ సింగ్ తెలిపారు. ఈ మేరకు గురువారం పీర్జాదిగూడ నగర మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ టీవీ ఎస్ ఎన్ త్రిలేశ్వరరావు ఆధ్వర్యంలో అర్హులకు ఇండ్ల పట్టాల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మేయర్ అమర్ సింగ్ పలువురు మాజీ కార్పొరేటర్లు హాజరై లబ్ధిదారులకు ఇండ్ల పట్టాల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ మేయర్ అమర్‌సింగ్ మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను, ఇతర హామీలను నెరవేరుస్తుందన్నారు. నిరుపేదలకు సొంతింటి కల నెరవేరబోతుందని ఆయన పేర్కొన్నారు. అలాగే పీర్జాదిగూడ నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ మేరకు మొదటి దశలో మేడ్చల్-మల్కాజిగిరి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయబడ్డాయని, వాటిలో పలు ఇళ్లు పీర్జాదిగూడలో ఇప్పటికే నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు. మిగిలిన ఇళ్ల నిర్మాణ పనులు త్వరలో ప్రారంభమై పూర్తి చేయబడ తాయని కూడా పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను, ఇతర హామీలను నెరవేరుస్తుందన్నారు. నిరుపేదలకు సొంతింటి కల నెరవేరబోతుందని ఆయన పేర్కొన్నారు. అలాగే పీర్జాదిగూడ నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు బొడిగె స్వాతికృష్ణ గౌడ్, కుర్ర శాలిని శ్రీకాంత్ గౌడ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, పలువురు నాయకులు, పీర్జాదిగూడ మహిళా అధ్యక్షురాలు దుర్గ, మేడిపల్లి శ్రీ వీరాంజనేయ స్వామి దేవాలయ డైరెక్టర్లు తవిటి ప్రశాంత్, వంగూరి పరమేశ్, కాంగ్రెస్ నాయకులు రాజరాజు లబ్ధిదారులకు మంజూరు పత్రాలు పంపిణీ చేశారు.







## అధిక ధరలకు విక్రయిస్తున్న యూరియా

- యూరియా కొనాలంటే మరొకటి కొనాల్సిందే
- ఒక బస్తా లేదా రెండు బస్తులు మాత్రమే
- నాన్న ఇబ్బందులు పడుతున్నామంటున్న రైతులు
- సంబంధిత అధికారులకు తెలిపిన పట్టించుకోవడం లేదన్న రైతులు
- తమగోసను మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనందతో పంచుకున్న రైతులు

**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** యూరియా కొరకు రైతుల వికారాబాద్ పట్టణ కేంద్రంలోని పిఏసిఎస్ కార్యాలయము దగ్గర నిలబడిన రైతులను వికారాబాద్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ పరమర్శించారు. ఈ సందర్భంగా రైతులు తమ ఇబ్బందులను తెలిపారు. ఫర్టిలైజర్ షాపు వాళ్లు పిచికారి చేయవలసిన మందులను కూడా అధిక ధరలకు విక్రయిస్తున్నారని సంబంధిత అధికారులకు తెలిపిన గాని ఎవరు పట్టించుకోవడంలేదని ఆరోపించారు. డిఏపి, యూరియా కూడా అధిక ధరలకు విక్రయిస్తున్నారని ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు ఎందుకు అమ్మరని అడిగినందుకు మీ ఇష్టం ఉంటే తీసుకోండి లేకపోతే వెళ్ళండి అంటున్నారని మండల వ్యవసాయ అధికారులకు తెలిపిన కానీ పట్టించుకోవడంలేదని మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ కు తెలిపారు. అదేవిధంగా ఒక యూరియా బస్తా కొనాలంటే అదనంగా ఒక మందు కొనాల్సిందేనని ఫర్టిలైజర్ షాపు యజమాన్యులు ప్రవర్తిస్తున్నారని రైతులు ఆరోపించారు. రైతుకు అవసరం ఉన్నప్పుడే యూరియా అందించాలని అధిక ధరలకు విక్రయిస్తున్న ఫర్టిలైజర్ షాపులపై సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

# దండాలయ్యా.. ఉండ్రాలయ్యా

**వినాయక చవితి పర్వదినం ఘనంగా జరుపుకున్నారు. వర్షాల కారణంగా మంటపాలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అయినా ప్రజలు ఉత్సాహంగా పూజల్లో పాల్గొన్నారు. ఎక్కడ చూసినా సందడి కనిపించింది.**



**భీమదేవరపల్లి, రాజముద్ర న్యూస్:** భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ లోని వివేకానంద యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 30 వ వార్షికోత్సవ గణపతి నవరాత్రి ఉత్సవాలు బుధవారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండపాన్ని యూత్ సభ్యులు మామిడి తోరణాలు, అరటి ఆకులు, డెకరేషన్ క్లాత్ లతో ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన గణపతి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలను స్వీకరించారు. ప్రతి ఏటా ఇక్కడ వినాయకుడికి యూత్ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు శ్రీనాథ్, శ్రీధర్, యుగేందర్, విజయ్, అభినయ్, లోకేష్, విగ్నేష్, చాణక్య, లోహితాక్ష్, లడ్డు, అక్షయ్, సుకృత్, లలిత్ వర్మ, సమ్మయ్య పాల్గొన్నారు.






**మేడిపల్లి, రాజముద్ర న్యూస్:** పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ బుద్ధానగర్ లో జై హనుమాన్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. దాసరి శ్రావణి దయాకర్ రెడ్డి దంపతులు విగ్రహం ఇప్పించి గణనాథునకి భక్తిశ్రద్ధలతో మొదటిరోజు పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ సభ్యులతో వారి కుటుంబాలతో పాల్గొని వేద మంత్రోచ్చరణల మధ్య గణపతి పూజలలో పాల్గొన్నారు. అనంతరం ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీవాసులతో పాటు ఫ్రెండ్స్ అందరం కలిసి గత కొన్ని సంవత్సరాలుగా వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నామని గణనాదుని ఆశీస్సులు మాపై ఉన్నాయని అన్నారు. ఇక్కడ ఉత్సవాలు నిర్వహించడానికి సహకరిస్తున్న ప్రజాప్రతినిధులకు భక్తులకు కృతజ్ఞతలు తెలిపారు.



మేడ్చల్ పట్టణంలోని ఎన్ జే ఆర్ కేఎల్ఆర్ కాలనీలో గల భవన నిర్మాణ కార్మికుల సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన గణనాథుని గురువారం సాయంత్రం దర్శించుకున్న అనంతరం స్వామివారి ప్రసాదాన్ని స్వీకరిస్తున్న మేడ్చల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ అద్దాని సత్యనారాయణ



రాజేంద్రనగర్ : నార్సింగి మున్సిపాలిటి వట్టినాగులపల్లి మహాత్మ జ్యోతిరావు పూలే యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాధునికి యువకులు ఉత్సాహంగా మొదటి రోజు పూజను నిర్వహించారు.



రాజేంద్రనగర్ : నార్సింగి హైట్స్ లో ఏర్పాటు చేసిన గణనాథుని పూజ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన గండిపేట్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కైరంకొండ వినోద్

# తీరు మారని అధికారులు..?

- పర్మిషన్ జీరో.. ! డోంట్ కేర్ అంటున్న బిల్డర్
- కింది స్థాయి వారు అందర్నీ మేనేజ్ చేస్తున్నారంటగా..!
- 24 సర్కిల్ లో అందిన కాడికి దండుకుంటూ అనుమతిలిస్తున్నారా..!
- కంప్లైంట్లు బుట్ట దాఖలేనా..?

**కూకట్ పల్లి, రాజముద్ర న్యూస్ :** కూకట్పల్లి సర్కిల్ పరిధిలో ఎక్కడైనా సరే దర్జాగా అక్రమ నిర్మాణాన్ని నిర్మించుకో మేము నీ ముందుంటాం... అనేలా ఉన్నాయి 24 సర్కిల్ టౌన్ ప్లానింగ్ లోని కొందరు అధికారుల తీరు. గతం నుండే కొన్ని అక్రమ నిర్మాణాలపై స్థానికుల నుండి ఎన్నో కంప్లైంట్లు, పత్రికల్లో వార్త కథనాలు వచ్చినా అధికారుల తీరు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు గా ఉందని స్థానికులు వాపోతున్నారు. హైదర్ నగర్ డివిజన్ పరిధిలోని హెచ్ ఎం టి హిల్స్ కాలనీలో ఒక నిర్మాణ దారుడు అనుమతులకు మించి అదనంగా నిర్మిస్తున్నా చర్యలు తీసుకోకుండా ఉన్నాడంటే.. కింది స్థాయిలో తెలిసిన వారితో మేనేజ్ చేసుకున్నాడని అనుకుంటున్నారు. అదే హైదర్ నగర్ డివిజన్లో ఇంద్రానగర్ కాలనీ లో మరొకరు అసలు ఏమాత్రం అనుమతి తీసుకోకుండా అయిదు అంతస్తులు నిర్మించి కింద షట్టర్లు కూడా వేయించినట్లు సమాచారం. ఇందుకు కూడా టౌన్ ప్లానింగ్ విభాగంలో నియమి తమైన కొందరికి లక్షల్లో ముడుపులు సమర్పించుకొని నిర్మిస్తున్నాడని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంతకు మునుపే కొన్ని పత్రికల్లో వచ్చినా ఇప్పటికీ సదరు నిర్మాణంపై ఏ విధమైన చర్యలు తీసుకోకుండా ఉన్నారు. ఇందులో డీసీ కి కూడా వాటా ఉందేమోనని స్థానికంగా అనుకోవడం గమనార్హం.








## ప్రభుత్వాసుపత్రిలో చేర్చుకోక ఓ నిండు ప్రాణం బలి

**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** అత్యవసర చికిత్స కోసం వికారాబాద్ పట్టణ కేంద్రంలోని పాతప్రభుత్వ ఆసుపత్రికి వస్తే ఆస్పత్రిలో చేర్చుకోకుండా బయటినుండి కొత్త ఆసుపత్రికి వెళ్ళమని పంపియడముతో ఓ నిండు ప్రాణం బలైపోయిన సంఘటన వికారాబాద్ పట్టణంలో చోటుచేసుకుంది. బాధితు లు తెలిపిన వివరాల ప్రకారం అత్యవసర పరిస్థితిలో చికిత్స కోసం బస్టాండ్కు దగ్గరలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రికి బాధితు లు వెళ్లి ఎమర్జెన్సీ ఉందని తెలిపిన కానీ ఆస్పత్రిలో చేర్చుకోకుండా కొత్త ఆసుపత్రికి వెళ్ళమని చెప్పి అక్కడినుండి పంపియడంతో మార్గమధ్యంలో రైల్వే గేట్ సిగ్నల్ పడటంతో చికిత్స అంతవలసిన వ్యక్తికి సమయానికి చికిత్స అందకపోవడం నిండు ప్రాణం బలికవడం జరిగిందన్నారు. అత్యవసర పరిస్థితుల్లో చికిత్స అందించవలసిన వైద్యులు ఒక ఆస్పత్రి నుండి మరొక ఆసుపత్రికి తరలించడం ప్రాణాలతో చెలగాడటమే అని ఆరోపించారు. కొత్త ఆసుపత్రికి వెళ్లి చూడగా ప్రాణం పోయిందని నిర్ధారణ కావడంతో మార్గమధ్యంలో ప్రయాణించటం ద్వారానే ఈ వ్యక్తి చనిపోవడం జరిగిందని బాధితులు ఆరోపించారు. పాత ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్నప్పుడు చికిత్స అందించినట్లయితే బ్రతికే వాడేమో అని పేర్కొన్నారు. ఈ విధంగా నిర్లక్ష్యం వహించిన సంబంధిత అధికారులకు ఉన్నత అధికారులు వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.



## అధ్యక్షా.. చైనాపై చర్యలేవి..?

### ట్రంప్‌పై స్వదేశం నుంచే వ్యతిరేకత



**యూఎస్ :** రష్యా నుంచి రాయితీపై చమురు కొనుగోలు చేస్తోందన్న అక్కసుతో భారత్‌పై అమెరికా సుంకాల మోత మోగిస్తోంది. దిగుమతి సుంకాలను అమాంతం 50 శాతానికి పెంచేసింది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న ఈ నిర్ణయంపై స్వదేశం నుంచే విమర్శలు ఎదురవుతున్నాయి. ట్రంప్ తీరును విపక్ష డెమోక్రాట్‌లు తీవ్రంగా తప్పుబడుతున్నారు. భారత్‌పై అంత పెద్ద మొత్తంలో సుంకాలు విధించడం సమంజసం కాదని డెమోక్రాట్ విదేశీ వ్యవ హారాల కమిటీ ఆక్షేపించింది. చైనా కూడా మాస్కో నుంచి పెద్ద మొత్తంలో ముడిచము రును కొనుగోలు చేస్తోందని, ఆ దేశంపై అమెరికా ఇలాంటి చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ట్రంప్‌ను ప్రశ్నించింది. అధ్యక్షుడి నిర్ణయం అమెరికా ప్రజలను కూడా బాధిస్తోందని తెలిపింది. ట్రంప్ తాజా నిర్ణయం గత రెండు దశాబ్దాలుగా బలోపేతమైన ఇండో అమెరికా సంబంధాలపై తీవ్ర ప్రభావం చూపిస్తుందని పేర్కొంది. ఈ మేరకు తన అధికారిక ఎక్స్ ఖాతాలో పోస్టు చేసింది. "రష్యా నుంచి అధిక మొత్తంలో చమురు కొనుగోలు చేస్తోన్న చైనా సహా ఇతర దేశాలపై ఆంక్షలను విధించని ట్రంప్ సర్కారు.. భారత్‌పై మాత్రం సుంకాలను అమాంతం పెంచుకుంటూ వెళ్తోంది. ఇది కేవలం భారత ప్రజలనే కాదు.. అమెరికన్ల మనోభావాలను కూడా దెబ్బతీస్తోంది. అమెరికా-భారత్ సంబంధాలపై తీవ్ర ప్రభావం చూపిస్తుంది. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న ప్రతి దేశంపైనా ఆంక్షలు విధిస్తే సరే.. కానీ, ట్రంప్ తీరు అందుకు భిన్నంగా ఉంది. కేవలం భారత్‌పైనే సుంకాలు విధించడం గందరగోళం సృష్టి స్తోంది. రష్యా నుంచి అతిపెద్ద చమురు దిగుమతిదారు చైనా. ఇప్పటికీ రాయితీ ధరకు ముడి చమురు కొనుగోలు చేస్తోంది. ఆ దేశంపై ట్రంప్ ఎలాంటి చర్యలు తీసుకున్నారు" అంటూ న్యూయార్క్ టైమ్స్ కథనాన్ని కూడా ఈ సందర్భంగా ప్యానెల్ ప్రస్తావించింది. అమెరికా విధించిన తాజా సుంకాలు 48.2 బిలియన్ డాలర్ల విలువైన ఎగుమతులపై ప్రభావం చూపిస్తాయని భారత్ అంచనా వేస్తోంది. కొత్త సుంకాల వల్ల అమెరికాకు ఎగుమతులు వాణిజ్యపరంగా అంత లాభసాటిగా ఉండబోవని, ఆర్థిక వృద్ధి మందగిస్తుందని నిపుణులు చెబుతున్నారు. అయితే, అమెరికా ఒత్తిడికి లొంగే ప్రసక్తే లేదని ప్రధాని మోదీ ఇప్పటికే స్పష్టంచేశారు. ప్రస్తుతానికి ఔషధాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు వంటి రంగాలను అదనపు సుంకాల నుంచి అమెరికా మినహాయించింది. ఈ రంగాల్లో భారత్ ఎగుమతి అధిక స్థాయిలో ఉండటం కొంత ఉపశమనం కలిగించే విషయమే.



## ఇన్‌స్టాలో భర్తకు విడాకులు..
## ర్యాపర్‌తో ఎంగేజ్‌మెంట్

### వైరల్‌గా దుబాయ్ యువరాణి

**దుబాయ్ :** ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో భర్తకు విడాకులు ఇచ్చిన దుబాయ్ యువరాణి షేకా మహ్రా మొహమ్మద్ రషీద్ అల్ మక్తూమ్ గతేడాది సెన్సేషన్‌గా మారిన సంగతి తెలిసిందే. తాజాగా ఆమె మరోసారి వార్తల్లో నిలిచారు. ప్రముఖ ర్యాపర్ ఫ్రెంచ్ మోంటానాతో షేకా మహ్రాకు నిశ్చితార్థం జరిగింది. ఈవిషయాన్ని ర్యాపర్ అధికార ప్రతినిధి ధ్రువీకరించినట్లు ఓ అంతర్జాతీయ మీడియా కథనం వెల్లడించింది. వీరిద్దరూ డేటింగ్‌లో ఉన్నట్లు గత కొంతకాలంగా వార్తలు వస్తున్నాయి. విడాకులు ప్రకటించిన కొన్నాళ్లకే షేకా మహ్రా.. మోంటానాతో కలిసి దుబాయ్ వీధుల్లో కన్పించారు. ఈ ఏడాది జూన్‌లో జరిగిన పారిస్ ఫ్యాషన్ వీక్‌లో వీరిద్దరూ కలిసి కన్పించారు. ఆ సమయంలోనే వీరికి ఎంగేజ్ మెంట్ జరిగినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం వీరి ఫొటోలు నెట్టింట వైరల్‌గా మారా యి. 31 ఏళ్ల షేకా మహ్రా.. దుబాయ్ పాలకుడు, యూఏఈ ప్రధానమంత్రి షేక్ మొహమ్మద్ బిన్ రషీద్ అల్ మక్తూమ్ కుమార్తె. బ్రిటన్‌లో ఉన్నతవిద్య అభ్యసించిన ఆమె అంతర్జాతీయ వ్యవహారాల్లో పట్టా పొందారు. మహిళా సాధికారతకు కృషి చేస్తున్నారు. దుబాయ్‌కు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త షేక్ మనా బిన్ మొహమ్మద్ అల్ మక్తూమ్‌తో మే 27, 2023న మహ్రాకు వివాహం జరిగింది. అయితే, ఈ బంధం ఎంతోకాలం నిలువలేదు. గతేడాది బిడ్డకు జన్మనిచ్చిన కొంతకాలానికే ఆమె భర్త నుంచి విడిపోయారు. ఆ సమయంలో 'ఐ డివోర్స్ యూ' అంటూ ఇన్‌స్టాలో విడాకులు ప్రకటన చేసి సంచలనంగా మారారు. ఆ తర్వాత 'డివోర్స్' పేరుతో పర్‌ఫ్యూమ్ విక్రయాలు ప్రారంభించారు. ఇక, మొరాకో-అమెరికన్ అయిన 40 ఏళ్ల ర్యాపర్ ఫ్రెంచ్ మోంటానా.. 'అన్‌ఫర్‌గటబుల్', 'నో స్టైలిస్ట్' వంటి ఆల్బమ్స్‌తో ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ఆదరణ సొంతం చేసుకున్నారు. మోంటానా గతంలో వ్యాపారవేత్త నదీన్‌ను వివాహం చేసుకొని విడిపోయారు. మొదటి భార్యతో ఆయనకు 16 ఏళ్ల కుమారుడు ఉన్నాడు.



## జమ్మూకశ్మీర్‌లో భారీ వర్షాలు

**జమ్మూకశ్మీర్ :** జమ్మూకశ్మీర్‌ను భారీ వర్షాలు కుదిపేస్తున్నాయి. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఆకస్మిక వరదల కారణంగా ఇప్పటివరకు 41 మంది మృతి చెందినట్లు అధికారులు వెల్లడించారు. కత్రాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన వైష్ణోదేవి ఆలయానికి వెళ్లే మార్గంలో కొండచరియలు విరిగిపడటంతో 34 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. వారిలో 18 మంది మృతదేహాలను వెలికితీసి జమ్మూలోని మెడికల్ కళాశాలకు తరలించారు. వారిని పంజాబ్, ఢిల్లీ, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన యాత్రికులుగా గుర్తించారు. మరోవైపు ప్రమాదకర మార్గాల్లో రాకపోకలను అధికారులు నిలిపివేశారు. భారీ వర్షాల కారణంగా జమ్మూకశ్మీర్ వ్యాప్తంగా పలుచోట్ల వరదలు సంభవించాయి. దక్షిణ కశ్మీర్‌లోని జీలం నది ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తోంది. ఇప్పటికే లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వరద ముప్పు నేపథ్యంలో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వైష్ణోదేవి ఆలయానికి వెళ్లే మార్గంలో జరిగిన ప్రమాదంపై అక్కడి ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. ఈ ఘటనపై ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. వాతావరణ హెచ్చరికలు ఉన్నప్పటికీ.. ఆ మార్గంలో యాత్రికులను ఎందుకు అనుమతించారంటూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

## అమెరికా చదువు..
## నాలుగేళ్లకు మించి ఉండొద్దు

### విదేశీ విద్యార్థుల నెత్తిన మరో పిడుగు



**వాషింగ్టన్:** అమెరికాలో చదువుల కోసం ప్రయత్నిస్తున్న, అగ్ర రాజ్యంలో ఉంటున్న విదేశీ విద్యార్థులపై మరో పిడుగు పడిం ది. ఇప్పటికే వీసాల జారీకి 'సోషల్ మీడియా వెట్టింగ్'ను కఠినంగా అమలుచేస్తోన్న అగ్రరాజ్యం.. తాజాగా మరో మార్పు తీసుకొచ్చేందుకు సిద్ధమైంది. విద్యార్థులు, ఎక్స్ఛేంజ్ విజిటర్లు, మీడియా ప్రతినిధులకు జారీ చేసే వీసాలకు పరిమిత కాల గడువు విధిస్తూ ప్రతిపాదనలను ఆవిష్కరించింది. అంటే.. ఇకపై విదేశీ విద్యార్థులు నాలుగేళ్లకు మించి అమెరికాలో ఉండకుండా వీసా నిబంధనల్లో మార్పులు చేయనుంది. ప్రస్తుతం ఎఫ్-1 వీసాలపై అమెరికాలో ఉన్న అంతర్జాతీయ విద్యార్థులు, జే-1 వీసాలపై వచ్చిన ఎక్స్ఛేంజ్ విజిటర్లకు 'డ్యూరేషన్ ఆఫ్ స్టే' వెసులుబాటు ఉంది. అంటే.. వారు ఎంతకాలం చదవాల నుకుంటే లేదా ఇంటర్న్ ప్రోగ్రామ్‌లో పాల్గొనాలనుకుంటే.. అంతకాలం అగ్రరాజ్యంలో ఉండొచ్చు. ఎక్స్ఛేంజ్ విజిటర్స్‌గా వచ్చే విద్యార్థులు, ప్రొఫెసర్లు, స్కాలర్లు, స్పెషలిస్ట్‌లు, ట్రైనీలు, ఇంటర్న్‌లు, ఫిజీషియన్లకు కూడా ఈ సదుపాయం వర్తిస్తుంది. అయితే, ఈ ఫ్లెక్సిబుల్ స్టూడెంట్ వీసా సిస్టమ్‌లో మార్పులు తీసుకొచ్చేందుకు ఇప్పుడు డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం సిద్ధమైంది. ఈ వీసాలకు కూడా గడువు విధించేలా 'పరిమిత కాల నివాస అనుమతి'తో కూడిన వీసాలను మంజూరుచేయాలని ప్రతిపాదించింది. "విదేశీ విద్యార్థులు, ఇతర వీసాదారులు అమెరికాలో నిరవధికంగా నివసించేలా చాలాకాలంగా అమెరికాలోని గత ప్రభుత్వాలు అనుమతి కల్పించాయి. దీని వల్ల భద్రతాపరమైన ఇబ్బందులతో పాటు అమెరికన్లకు ప్రయోజనాలపై దెబ్బ పడింది. దీనికి ముగింపు పలికేలా కొత్త నిబంధనలను ప్రతిపాదించాం. కొన్ని రకాల వీసాదారుల నివాస అనుమతులపై పరిమితి తీసుకొస్తున్నాం. దీనివల్ల ఫెడరల్ ప్రభుత్వంపై భారం తగ్గనుంది" అని హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం తమ నోటీసుల్లో పేర్కొంది.

**ప్రతిపాదనల్లో సూచించిన మార్పులు ఇవే..**

- ఎఫ్, జే వీసా పొందిన విదేశీ విద్యార్థులు, ఎక్స్ఛేంజ్ విజిటర్లు అమెరికాలో చదువుకునేందుకు గరిష్ఠ కాల పరిమితి నాలుగేళ్లుగా నిర్ణయించారు.
- గ్రాడ్యుయేట్ స్థాయి ఎఫ్-1 విద్యార్థులు కోర్సు మధ్యలో ప్రోగ్రామ్‌లు మార్చుకుంటే ఆంక్షలు ఎదుర్కోవాల్సి ఉంటుంది.
- ఎఫ్-1 విద్యార్థులు చదువు పూర్తి చేసుకున్న తర్వాత మరో వీసా కోసం ప్రయత్నించాలనుకుంటే.. ఆ గ్రేస్ పీరియడ్‌ను 60 రోజుల నుంచి 30 రోజులకు కుదించారు.
- విదేశీ మీడియా సంస్థల ప్రతినిధులు తీసుకునే ఐ-వీసాదారులు 240 రోజుల వరకు అమెరికాలో ఉండొచ్చు. ఆ తర్వాత మరో 240 రోజుల వరకు తమ నివాస అనుమతిని పొడిగించుకునే వెసులుబాటు కల్పిస్తున్నారు.
- దేశ భద్రతా ప్రయోజనాల దృష్ట్యా చైనీస్ మీడియా ప్రతినిధులు అదనపు ఆంక్షలు ఎదుర్కోవాల్సి ఉంటుంది.

అయితే, విదేశీ విద్యార్థులు గడువు తీరిన తర్వాత వీసా పొడిగింపునకు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలా, లేదా అనేదానిపై ప్రస్తుతానికి స్పష్టత లేదు. ఈ ప్రతిపాదనలను గురువారం (అమెరికా కాలమానం ప్రకారం) ఫెడరల్ రిజిస్ట్రీలో పబ్లిష్ చేయనున్నారు. ఆ తర్వాత ప్రతిపాదనలపై 30 లేదా 60 రోజుల వరకు ప్రజాభిప్రాయాలు స్వీకరించి తుది నిర్ణయం తీసుకుంటారు. ప్రజల నుంచి ఎలాంటి అభిప్రాయాలు తీసుకోకుండానే తక్షణమే అమల్లోకి వచ్చేలా దీనిపై మధ్యంతర ఉత్తర్వులు కూడా జారీ చేసే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ఈ మార్పులు అమల్లోకి వస్తే భారతీయ విద్యార్థులపై అధిక ప్రభావం పడే అవకాశం ఉంది. ప్రస్తుతం 3.3 లక్షల మందికి పైగా భారతీయులు అమెరికా వర్సిటీల్లో చదువుకుంటున్నారు.

## కీవ్‌పై బాంబుల వర్షం..

### 598 డ్రోన్లతో విరుచుకుపడిన రష్యా



**కీవ్:** ఉక్రెయిన్‌పై రష్యా దాడులు ఆగడం లేదు. ఆ రెండు దేశాల మధ్య శాంతి ఒప్పందం కుదిర్చేందుకు ఓ వైపు అమెరికా ప్రయత్నం చేస్తున్నప్పటికీ.. ఫలితం పెద్దగా కనిపించడం లేదు. ఉక్రెయిన్ రాజధాని కీవ్ నగరంపై గురువారం రష్యా డ్రోన్లతో విరుచుకుపడింది. ఏకంగా 598 డ్రోన్లు, 31 తేలికపాటి క్షిపణులను ప్రయోగించినట్లు ఉక్రెయిన్ ఎయిర్ ఫోర్స్ వర్గాలు వెల్లడించాయి. ఈ దాడుల్లో 12 మంది ప్రాణాలు కోల్పోగా.. 48 మందికి గాయాలైనట్లు ఉక్రెయిన్ పేర్కొంది. మృతుల్లో 2, 14, 17 ఏళ్ల వయసున్న ముగ్గురు చిన్నారులు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. మూడేళ్లుగా కొనసాగుతున్న ఉక్రెయిన్-రష్యా యుద్ధాన్ని ముగించేందుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఇరు దేశాల అధ్యక్షులతోనూ మంతనాలు సాగిస్తున్నారు. ఇరుదేశాల మధ్య శాంతి ఒప్పందం దిశగా అడుగులు పడుతున్న క్రమంలో ఇటీవల రష్యా చేపట్టిన అతిపెద్ద దాడి ఇదే. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశమున్నట్లు ఉక్రెయిన్ వర్గాలు తెలిపాయి. తాజా ఘటనను ఆ దేశ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తీవ్రంగా ఖండించారు. చర్చలకు రాకుండా రష్యా బాలిస్టిక్ క్షిపణులను వినియోగిస్తోందని మండిపడ్డారు. " శాంతిని కోరుకునే యావత్ ప్రపంచం తాజా ఘటనపై స్పందించాలి. గతంలో చాలా మంది శాంతి మంత్రం జపించారు. ఇప్పుడు మాత్రం మిన్నకుండిపోతున్నారు." అంటూ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. కీవ్ నగరంలోని దాదాపు 20 ప్రాంతాల్లో డ్రోన్ దాడులు జరిగినట్లు తెలుస్తోంది. సుమారు 100 భవనాలు పూర్తిగా లేదా పాక్షికంగా దెబ్బతిన్నట్లు సమాచారం. మరోవైపు 563 డ్రోన్లను, 26 క్షిపణులను విజయవంతంగా నేల కూల్చినట్లు ఉక్రెయిన్ ఎయిర్‌ఫోర్స్ వెల్లడించింది. తాజా పరిస్థితుల నేపథ్యంలో రష్యా ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసేలా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాల పెంపు సహా, మరిన్ని కీలక నిర్ణయాలు తీసుకుంటారని ఉక్రెయిన్ భావిస్తోంది. ఇదే విషయాన్ని జెలెన్‌స్కీ కూడా ప్రస్తావించారు. 'యుద్ధాన్ని ముగించేందుకు ఇచ్చిన అన్ని గడువులను రష్యా ఇప్పటికే అతిక్రమించింది. ఇరుదేశాల మధ్య శాంతి కుదిర్చేందుకు చేసిన దౌత్య ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి' అని అన్నారు. జెలెన్‌స్కీతో ప్రత్యక్షంగా శాంతి చర్చలు జరిపేందుకు అమెరికా చేసిన ప్రతిపాదనను పుతిన్ తిరస్కరించడంపై ఇటీవల ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. ప్రత్యక్ష చర్చలకు షెడ్యూల్ ఖరారు కాకపోతే రెండు వారాల్లో నిర్ణయం తీసుకుంటానని గత శుక్రవారం ట్రంప్ వ్యాఖ్యానించారు. మరోవైపు గురువారం రాత్రి ఉక్రెయిన్‌కు చెందిన 102 డ్రోన్లను నేల కూల్చినట్లు రష్యా రక్షణ శాఖ వెల్లడించింది. రష్యాలోని నైరుతి భాగమే లక్ష్యంగా ఉక్రెయిన్ డ్రోన్ దాడులకు దిగుతున్నట్లు పేర్కొంది. క్రాస్నోడార్ ప్రాంతంలోని అఫిప్‌స్కీ చమురుశుద్ధి కర్మాగారంపై డ్రోన్ దాడి కారణంగా మంటలు చెలరేగినట్లు స్థానిక అధికారులు తెలిపారు. సమర రీజియన్‌లోని మరో చమురు శుద్ధి కేంద్రంపైనా ఉక్రెయిన్ డ్రోన్‌తో దాడి చేసినట్లు తెలుస్తోంది. రష్యా ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసేందుకు.. చమురుశుద్ధి కేంద్రాలనే ఉక్రెయిన్ ప్రధానంగా ఎంచుకుంటోంది.

## బిహార్‌లోకి చొరబడిన జైషే ఉగ్రవాదులు

### ఎన్నికల ముందు రాష్ట్రంలో హైఅలర్ట్



**పట్నా:** మరికొన్ని నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న బిహార్‌లో ఉగ్ర కలకలం రేగింది. రాష్ట్రంలోకి ముగ్గురు జైషే మహ్మద్ ఉగ్రవాదులు చొరబడినట్లు నిఘా వర్గాల నుంచి సమాచారం అందింది. దీంతో బిహార్ పోలీసు హెడ్ క్వార్టర్స్ గురువారం రాష్ట్రవ్యాప్తంగా హై అలర్ట్ జారీ చేసింది. ఉగ్రవాదుల ఫొటోలు, వివరాలను విడుదల చేసింది. వీరు నేపాల్ మీదుగా బిహార్ చేరుకున్నట్లు సీనియర్ అధికారులు వెల్లడించారు. ఉగ్రవాదులను హస్నైన్ అలీ (రావల్పిండి), ఆదిల్ హుస్సేన్ (ఉమర్‌కోట్), మహ్మద్ ఉస్మాన్ (బహవల్ పూర్)గా గుర్తించారు. వీరంతా పాక్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న జైషే మహ్మద్ ముఠా సభ్యులని బిహార్ పోలీసులు వెల్లడించారు. ఆగస్టు రెండోవారంలో వీరు కాఠ్‌మాండూ చేరుకుని, గతవారం బిహార్‌లోకి చొరబడ్డారని నిఘా వర్గాలు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. ఇప్పటికే వీరి ఫొటోలు, ఇతర వివరాలను సరిహద్దు జిల్లాల పోలీసులకు పంపించారు. ఈ ప్రాంతాల్లో నిఘా పెంచాలని, అనుమానాస్పదంగా ఎవరైనా కన్పిస్తే తక్షణమే సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ ఏడాది చివర్లో బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ ఈ పరిణామం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. మరోవైపు, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రస్తుతం ఈ రాష్ట్రంలోనే పర్యటిస్తున్నారు. ఈ నేపథ్యంలో బిహార్ వ్యాప్తంగా భద్రతను కట్టుదిట్టం చేశారు. నేపాల్‌తో సరిహద్దు ఉన్న జిల్లాలతో పాటు సీమాంచల్ ప్రాంతంలో భద్రతను పెంచారు. రైల్వే స్టేషన్లు, బస్ స్టేషన్లు, రద్దీ ప్రాంతాల్లో ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నారు. చెక్ పోస్టుల వద్ద పెట్రోలింగ్‌ను పెంచారు. ఈ ఏడాది మే నెలలోనూ బిహార్‌లో అనుమానాస్పద వ్యక్తుల కదలికలను నిఘా వర్గాలు గుర్తించాయి. కేవలం 20 రోజుల వ్యవధిలోనే 18 మంది కొత్తవారు రాష్ట్రానికి వచ్చినట్లు తెలియడంతో పోలీసులు గాలింపు చేపట్టారు. కొందరిని అరెస్టు చేయగా.. నిందితుల్లో ఒకడు ఖలిస్థానీ అనుకూలుడని తెలిసింది. ఈ రాష్ట్రం 729 కిలోమీటర్ల మేర నేపాల్‌తో సరిహద్దు పంచుకుంటోంది. దీంతో అక్రమ చొరబాట్లకు హాట్‌స్పాట్‌గా మారుతోంది.

## వాణిజ్యం ఇప్పుడో ఆయుధం

### టారిఫ్‌లపై రఘురాం రాజన్ కీలక వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ :** భారత్‌పై అమెరికా విధించిన అదనపు టారిఫ్‌లు కేవలం ట్రేడ్ టూల్ మాత్రమే కాదని రిజర్వ్ బ్యాంక్ ఇండియా మాజీ గవర్నర్ రఘురాం రాజన్ అన్నారు. రాజకీయ, ఆర్థిక శక్తిగా ఎదిగేందుకే ట్రంప్ ఈ సుంకాల భారం మోపుతున్నారని అభిప్రాయపడ్డారు. ఓ జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన టారిఫ్‌ల అంశంపై స్పందించారు. "టారిఫ్‌ల భారం భారత్‌కు ఓ మేలుకొలుపు లాంటిది. ఏ దేశంపైనా విస్తృతంగా ఆధారపడకూడదు. యూఎస్‌తో వాణిజ్యం కొనసాగిస్తూనే ఐరోపా, ఆఫ్రికా వంటి దేశాలపైనా దృష్టి సారించాలి. ఈ రోజుల్లో వాణిజ్యం, పెట్టుబడులు, ఆర్థిక అవసరాలు యుద్ధానికి ఆయుధాలుగా మారుతున్నాయి. వీటిపట్ల న్యూఢిల్లీ జాగ్రత్తగా వ్యవహరించాలి. వృద్ధికి ఊతమిచ్చే, యువతకు ఉపాధి కల్పించే సంస్కరణలను తీసుకురావాలి" అని సూచించారు. ట్రంప్ టారిఫ్‌లు విధించేందుకు అనేక కారణాలు ఉన్నాయని రాజన్ అన్నారు. "కరెంటు ఖాతా లోటు, ద్రవ్య లోటు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని అమెరికాను ఇతర దేశాలు వాడుకుంటున్నాయని ట్రంప్ భావిస్తున్నారు. కానీ, చౌక ధరకు వస్తువులను దిగుమతి చేసుకుంటున్నందుకు అమెరికా వినియోగదారులే ప్రయోజనం పొందుతున్నారన్న విషయాన్ని మర్చిపోయారేమో. ఇక, ఈ సుంకాలను ఆయన ఇతర దేశాలపై పన్నులుగా పరిగణిస్తున్నారు. తద్వారా అమెరికాకు ఆదాయం సమకూరుతుందని ఆలోచిస్తున్నారు. అయితే, దీని వల్ల సొంత ప్రజలకే నష్టం జరుగుతుందన్న విషయాన్ని గుర్తించట్లేదు. సైనిక శక్తిని ఉపయోగించలేని సందర్భాల్లో టారిఫ్‌లను తమ బలప్రయోగం కోసం ట్రంప్ వినియోగించుకుంటున్నారు" అని రాజన్ పేర్కొన్నారు.



## వణికిస్తున్న వర్షాలు..

### 50కి.మీ మేర ట్రాఫిక్ జామ్

**న్యూఢిల్లీ :** ఉత్తరాదిని భారీ వర్షాలు వణికిస్తున్నాయి. పర్వత ప్రాంతాల్లో పలుచోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో రోడ్లు మూసుకుపోయి, ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. చండీగఢ్- కులూమనాలి జాతీయ రహదారి పలుచోట్ల బ్లాక్ అయ్యింది. దీంతో వేలాది వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయినట్లు అధికారులు వెల్లడించారు. సుమారు 50 కి.మీ మేర ట్రాఫిక్ స్తంభించిపోయినట్లు చెప్పారు. దేశ రాజధాని దిల్లీకి ఈ మార్గంలోనే ఎక్కువగా పండ్లు, కూరగాయలు రవాణా అవుతాయి. దాదాపు ఆ ట్రక్కులన్నీ ట్రాఫిక్‌లో చిక్కుకున్నాయి. దీంతో ప్రయాణికులను నిలిపివేసి.. నిత్యావసర వస్తువుల రవాణాకు అంతరాయం కలగకుండా అధికారులు చర్యలు చేపట్టారు. సాధారణ ప్రయాణికులు గంటల పాటు వేచి చూడాల్సిన పరిస్థితి తలెత్తింది. దీంతో వారంతా ఆందోళనకు దిగారు. అధికారులు కలగజేసుకొని వారికి సర్దిచెప్పి ట్రాఫిక్‌ను చక్కదిద్దుతున్నారు. మండి- కులూ మధ్యనే దాదాపు 12 చోట్ల కొండ చరియలు విరిగిపడినట్లు అధికారులు చెబుతున్నారు. బియాస్ నదీ ఉద్ధృతంగా ప్రవహించడం వల్ల కులూ-మనాలి మధ్య పలుచోట్ల రహదారి కోతకు గురైనట్లు ఎన్‌హెచ్‌ఏఐ ఇంజినీర్ అశోక్‌చౌహాన్ తెలిపారు. పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నట్లు చెప్పారు. తాజా పరిస్థితులను దృష్టిలోఉంచుకొని విహార యాత్రలు ప్లాన్ చేసుకోవాలని సూచించారు.



## 'ఓట్ చోరీ'.. మరిన్ని ఆధారాలు
## బయటపెడతా : రాహుల్ గాంధీ

**పట్నా:** 'ఓట్ చోర్- గద్దీ ఛోడ్' అనే నినాదంతో 'ఓటర్ అధికార్ యాత్ర' చేపట్టిన కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ.. భాజపా, ఎన్నికల సంఘంపై విమర్శనాస్త్రాలు సంధిస్తున్నారు. తమ ఓట్లను దొంగిలిస్తే బిహార్ ప్రజలు సహించబోరన్నారు. ఓటర్ల జాబితా నుంచి రాష్ట్రవ్యాప్తంగా 65 లక్షల మంది ఓటర్ల పేర్లను తొలగించారని ఆక్షేపించారు. అందులో ఎక్కువమంది బడుగు బలహీనవర్గాల వారే ఉన్నారని అన్నారు. సీతామఢీలో నిర్వహించిన ఓటర్ అధికార్ యాత్రలో గురువారం ఆయన మాట్లాడుతూ.. 'ఓట్ చోరీ' గురించి రానున్న రోజుల్లో మరిన్ని ఆధారాలు బయటపెడతానని అన్నారు. "ఎన్నికల సంఘం, భాజపా కుమ్మక్కై ఓట్లను దొంగిలించాయి. గతంలో మహారాష్ట్ర, హరియాణా, కర్ణాటకలో ఇదే పంథా కొనసాగించారు. ఇప్పుడు బిహార్ వంతు వచ్చింది. కానీ, ఇక్కడి ప్రజలు దీన్ని సహించరు." అని అన్నారు. యాత్రలో భాగంగా స్థానిక సీతాదేవి ఆలయాన్ని రాహుల్ సందర్శించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం దొంగిలించిన ఓట్లతో ఏర్పడిందంటూ రాహుల్ విమర్శించారు. ప్రధానమంత్రి కూడా ఓట్ల తస్కరణకు పాల్పడ్డారని ఆరోపించారు. కొందరు పారిశ్రామికవేత్తలకు ప్రయోజనం కలిగించేందుకు ప్రజల ఓటు హక్కును దొంగిలించేందుకు భాజపా ప్రయత్నిస్తోందని ఘాటు విమర్శలు చేశారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కేంద్రంలో అధికారంలో ఉన్న భాజపా, ఎన్నికల సంఘం తీరును తప్పుబడుతూ రాహుల్ గాంధీ ఓటర్ అధికార్ యాత్రను చేపట్టిన సంగతి తెలిసిందే. ఈనెల 17న ప్రారంభమైన యాత్ర.. 16 రోజుల పాటు 1,300కి.మీ మేర సాగనుంది. వచ్చే నెల 1న పట్నాలో నిర్వహించే భారీ సభతో ముగుస్తుంది.

రాజముద్ర
www.rajamudranews.com
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక



# అందుకే టాలీవుడ్‌లో నటించలేదు

## కమలినీ ముఖర్జీ

'ఆనంద్' చిత్రంతో పరిచయమై, తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేశారు కమలినీ ముఖర్జీ. 'గోదావరి', 'గమ్యం' తదితర సినిమాలతోనూ ఆకట్టుకున్నారు. ఆ తర్వాత నటించిన చిత్రాల ఫలితం ఎలా ఉన్నా యాక్టింగ్ పరంగా మంచి మార్కులే కొట్టేశారు. ఆమె టాలీవుడ్‌కు దూరమై దశాబ్దం దాటింది. దానికి గల కారణాన్ని తాజాగా పాల్గొన్న ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. ఓ సినిమాలో పోషించిన పాత్ర తాను ఊహించినంత స్థాయిలో తెరకెక్కలేదని, ఆ క్యారెక్టర్‌పై అసంతృప్తి కలిగిందన్నారు. ఆ విషయంలో ఫీలయ్యానని, అందుకే తెలుగు సినిమాల్లో నటించలేదని చెప్పారు. తాను కలిసి నటించిన హీరోల గురించి మాట్లాడుతూ.. "నాగార్జున ఇప్పటికీ హ్యాండ్సమ్. సహ నటులతో ఆయన సరదాగా ఉంటారు. శర్వానంద్ సహజంగా నటిస్తారు. అంకిత భావంతో పని చేస్తారు. స్టార్ అని నిరూపించుకోవాల్సిన అవసరం ఆయనకు లేదు" అని కమలినీ పేర్కొన్నారు. 2014లో వచ్చిన 'గోవిందుడు అందరివాడేలే' తర్వాత కమలినీ తమిళంలో 'ఇరైవి', మలయాళంలో 'పులిమురుగన్'లో సందడి చేశారు.

# విజువల్ వండర్‌గా 'మిరాయ్'


యువ నటుడు తేజ సజ్జా ప్రధానపాత్రలో రూపొందుతోన్న చిత్రం 'మిరాయ్'. మంచు మనోజ్ ప్రతినాయకుడిగా కనిపించనున్నారు. కార్తిక్ ఘట్టమనేని దర్శకత్వంలో పాన్ ఇండియా స్థాయిలో ఇది రానుంది. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. 2 నిమిషాల 58 సెకన్లు ఉన్న ఈ వీడియోలో సినిమాలో వీఎఫ్ఎక్స్ ఎఫెక్ట్‌లు ఏ స్థాయిలో ఉండనున్నాయో చూపారు. 'దునియాలో ఏదీ నీది కాదు..', 'నా గతం నక్షత్రం.. నా ప్రస్తుతం ఊహాతీతం..' అంటూ వచ్చే డైలాగులు ఆకట్టుకుంటున్నాయి. సెప్టెంబర్ 12న ఈ సినిమా విడుదల కానుంది.




# బాహుబలి ది ఎపిక్

## ప్రభాస్, తమన్నాల రోమాన్స్ కట్

రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కి.. తెలుగు సినిమా ఖ్యాతిని పెంచిన 'బాహుబలి' మరోసారి వండర్స్ సృష్టించడానికి ఒకేచిత్రంగా విడుదలవుతోంది. ఈ చిత్రం విడుదలై పదేళ్లు పూర్తయిన సందర్భంగా మరోసారి ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ చేయనున్నట్లు టీమ్ ప్రకటించింది. రెండు భాగాలుగా వచ్చిన సినిమాలను 'బాహుబలి: ది ఎపిక్' పేరుతో ఒకే భాగంలో తీసుకురానున్నారు. అయితే అందులోని ఏ సన్నివేశాలను కట్ చేస్తారా? అని అందరిలో ఆసక్తి నెలకొంది. తాజాగా ఓ హాలీవుడ్ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో దర్శకధీరుడు ఈ సినిమాకు సంబంధించిన కొన్ని విషయాలను పంచుకున్నారు. బాహుబలి: ది ఎపిక్' రిలీజ్ విషయంలో అన్నిటికంటే కష్టమైన పని ఎడిటింగ్ అన్నరు. రెండూ కలిపి దాదాపు 5 గంటల 27 నిమిషాల రన్-టైమ్ ఉన్నాయి. వీటిని కట్ చేసి ఒక భాగంగా విడుదల చేయాలి. ఏ సన్నివేశాలను ఉంచాలి? వేటిని తీసేయాలి? అనే విషయంపై మేం తీవ్రంగా చర్చించుకుంటున్నట్లు వెల్డించారు. 'బాహుబలి'లోని ప్రతి సన్నివేశం, పాట నాకు విలువైనదే. దేన్ని తీసేయాలో అర్థం కాలేదు. నిడివి తగ్గించాలంటే కొన్ని కట్ చేయక తప్పదు. అందుకే పాట, కొన్ని సన్నివేశాలను తొలగించాలని



నిర్ణయించాం. 'కన్నా నిదురించరా' పాటను కట్ చేశాం. అలాగే, ప్రభాస్-తమన్నా మధ్య సాగే కొన్ని రొమాంటిక్ సన్నివేశాలను కూడా తొలగించాలని నిర్ణయించుకున్నాం. 'బాహుబలి: ది ఎపిక్'తో ప్రేక్షకులకు కొత్త అనుభవాన్ని ఇవ్వాలనుకుంటున్నా అని రాజమౌళి తెలిపారు. అక్టోబర్ 31న ఈ సినిమా ప్రపంచ వ్యాప్తంగా ఈ మూవీ విడుదల కానుంది. దీని నిడివి విషయంలో ఎన్నోవార్తలు వస్తున్నప్పటికీ చిత్రబృందం మాత్రం ఇప్పటి వరకూ అధికారికంగా స్పందించలేదు. ఎన్ని గంటలు ఉంటుందనే విషయం రాజమౌళికి తప్ప మరెవ్వరికీ తెలియదని నటు-డు రానా తెలిపారు. తాజాగా విడుదలైన ఈ సినిమా టీజర్ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది.

# 'అఖండ 2' వాయిదా..

## పండగకు పవన్ మూవీ ఒక్కటే

పలు కారణాల వల్ల ఇప్పటికే చాలా సినిమాల విడుదల తేదీల్లో మార్పులు చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. తాజాగా 'అఖండ 2' ఆ జాబితాలో చేరింది. ముందుగా ప్రకటించిన తేదీకి సినిమాని విడుదల చేసే పరిస్థితి లేదని, నిర్మాణ సంస్థ '14 రీల్స్ ప్లస్' అని పేర్కొంది. భారీ తరహాలో రూపొందిస్తున్న ఈ సినిమా రీ రికార్డింగ్, వీఎఫ్ఎక్స్ సహా పోస్ట్ ప్రొడక్షన్స్ కార్యక్రమాలకు మరింత సమయం పడుతుందని, అందుకే వాయిదా వేస్తున్నట్టు ప్రకటించింది. త్వరలోనే కొత్త విడుదల తేదీ వివరాలు వెల్లడిస్తామని తెలిపింది. బాలకృష్ణ హీరోగా దర్శకుడు బోయపాటి తెరకెక్కిస్తున్న చిత్రమిది. ఘన విజయం అందుకున్న 'అఖండ'కు సీక్వెల్‌గా రూపొందుతోంది. పవన్ కల్యాణ్ హీరోగా నటించిన 'ఓజీ' సెప్టెంబరు 25న విడుదల కానుందన్న సంగతి తెలిసిందే. దీంతో, దసరా పండగకు బాక్సాఫీసు వద్ద ఆసక్తికర పోటీ నెలకొంటుందని సినీ ప్రియులు అనుకున్నారు. మరోవైపు, ఈ రెండూ వాయిదా పడే అవకాశాలున్నాయంటూ కొన్ని రోజుల క్రితం ప్రచారం జరిగింది. 'ఓజీ' టీమ్ ఇప్పటికే వాటిని ఖండించింది. 'అఖండ 2'




విషయంలో తాజాగా స్పష్టత వచ్చింది. దసరా సెలవులను దృష్టిలో పెట్టుకుని రెండు చిత్ర బృందాలు ఆ తేదీని ప్రకటించడం గమనార్హం. దర్శకుడు సుజీత్ తెరకెక్కిస్తున్న 'ఓజీ'లో పవన్ గ్యాంగ్‌స్టర్‌గా నటించడంతో ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. 'అఖండ'కు కొనసాగింపు కావడం, ఈసారి హీరో పాత్ర అంతకుమించి ఉండటంతో 'ఆఖండ 2'పైనా అదేస్థాయిలో అంచనాలు ఉన్నాయి.

# ఇది కలా.. నిజమా?

## నన్ను నేను గిల్లి చూసుకుంటున్నా : మాళవిక



దర్శకుడు సత్యన్ అంతికాడ్, మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్ లాంటి లెజెండ్స్‌తో కలిసి పనిచేసే అవకాశం వస్తుందని తాను ఊహించలేదని మాళవిక మోహనన్ సంతోషం వ్యక్తం చేసింది. మోహన్‌లాల్ కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం 'హృదయపూర్వం'. సంగీత్ ప్రతాప్ కీలక పాత్ర పోషిస్తున్నాడు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ మూవీ ఆగస్టు 28న మలయాళంలో విడుదల కానుంది. ఈ సందర్భంగా మాళవిక 'హృదయ పూర్వం' మూవీకి పనిచేయడంపై సంతోషం వ్యక్తం చేసింది. అంతేకాదు, ఈ ఏడాది తనకెంతో ప్రత్యేకమని చెప్పింది. "ఇద్దరు లెజెండ్స్‌తో కలిసి పనిచేశానా? అని ఇప్పటికీ నన్ను నేను గిల్లి చూసుకుంటున్నా. వారిద్దరూ ఊహాలకందని వ్యక్తులు. డెస్టినీ అంటే ఇదేనేమో. మిమ్మల్ని చిరునవ్వులతో ముంచెత్త డానికి మేము సిద్ధంగా ఉన్నాం. ఇందులో నేను హరిత అనే మో డ్రన్ గర్ల్‌గా నటిస్తున్నా. ఈ పాత్రకు నేను చాలా కనెక్ట య్యా. జీవితంలో ఏం చేయాలనుకుంటే అది చేసే అమ్మాయిగా కనిపిస్తా. ఇప్పుడు నేను చెబుతున్నదాని కంటే డబుల్ ఎంటర్‌టైన్‌మెంట్ తెరపై చూస్తారు" అని మాళవిక చెప్పు కొచ్చింది. ఇక ఈ ఏడాది తనకెంతో ప్రత్యేకమని చెబుతూ సంతోషం వ్యక్తం చేసింది. మూడు ఇండస్ట్రీల నుంచి మూడు అద్భుతమైన సినిమాలతో ప్రేక్షకులను పలకరించనున్నట్లు పేర్కొంది.




# పెద్దిలో 1000 మంది డ్యాన్సర్లతో షూట్

రామ్‌చరణ్ 'పెద్ది' సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. వినాయక చవితి వేళ కూడా చిత్ర బృందం షూట్‌లో పాల్గొంది. మైసూరులో మొదలైన తాజా షెడ్యూల్‌లో బుధవారం ఓ మాస్ సాంగ్‌ను చిత్రీకరించారు. జానీ మాస్టర్ ఆధ్వర్యంలో రామ్‌చరణ్‌తోపాటు- 1000 మందికిపైగా డ్యాన్సర్లతో సాంగ్ షూట్ చేపట్టారు. సెట్స్ నుంచే చిత్ర బృందం ప్రేక్షకులకు పండగ శుభాకాంక్షలు తెలిపింది. ఈ మేరకు వీడియో విడుదల చేసింది. గ్రామీణ నేపథ్యంతో తెరకెక్కుతున్న స్పోర్ట్స్ డ్రామా మూవీ ఇది. కొన్ని రోజుల క్రితం రామోజీ ఫిల్మ్ సిటీలో కీలక షెడ్యూల్ షూటింగ్ పూర్తిచేసుకున్న సంగతి తెలిసిందే. 'ఉప్పెన' ఫేం బుచ్చిబాబు తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్. కన్నడ నటుడు శివ రాజ్‌కుమార్, బాలీవుడ్ నటు-డు దివ్యేందు శర్మ కీలక పాత్రలు పోషిస్తున్నారు. హీరో- డైరెక్టర్, హీరో-హీరోయిన్ కాంబినేషన్లతోపాటు- ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తుండటంతో ఈ సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన ఓ షాట్ మరిన్ని అంచనాలు పెంచింది. వచ్చే ఏడాది మార్చి 27న సినిమా విడుదల కానుంది.

# కొత్త లోక ట్రైలర్ విడుదల

ప్రేక్షకులను అలరించేందుకు మరో ఫాంటసీ థ్రిల్లర్ రాబోతోంది. కల్యాణి ప్రియదర్శన్ , నస్లేన్ ప్రధాన పాత్రల్లో డామినిక్ అరుణ్ తెరకెక్కించిన చిత్రం 'కొత్త లోక' తొలిభాగం 'కొత్త లోక: చంద్ర' పేరుతో ఈ నెల 29న బాక్సాఫీసు ముందుకు రానుంది. ఈ సందర్భంగా ఇప్పటికే మలయాళం ట్రైలర్ రిలీజ్ చేసిన చిత్ర బృందం తెలుగు ట్రైలర్ ను మంగళవారం విడుదల చేసింది. ఇందులో సూపర్ పవర్స్ ఉన్న లోకగా కల్యాణి కనిపించారు. వేరే ఊరికి వెళ్లిన లోక.. ఎందుకు తన పద్ధతి మార్చుకోవాల్సి వచ్చింది? ఆమెకు ఎదురైన సవాళ్లేంటి? తదితర అంశాలతో సినిమాని తెరకెక్కించనట్టు- -ట్రైలర్ చూస్తూ అర్థమవుతోంది.



Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com